నవతెలంగాణ
1
ఆదిలాబాద్
బుధవారం | అక్టోబర్ 04, 2023 | www.navatelangana.com

సమస్యలు పరిష్కరించాలని వినతి

ముథోల్ : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆశా వర్కర్లు అధికారులకు, నాయకులకు వినతిపత్రం అందజేశారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయ ఆవరణలో ముథోల్, తానూర్, బాసర, లోకేశ్వరం, కుంటాల, భైంసా ఆశా వర్కర్లు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.5లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంపీపీ అయేషా అఫ్రోజ్ ఖాన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల మండల అధ్యక్షురాలు విజయలక్ష్మి, రాధ, ఇంద్ర, రమా, సుజాత, గంగామణి పాల్గొన్నారు.



గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ హఠాన్మరణం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఏఆర్ హెడ్ క్వార్టర్‌కు చెందిన హెడ్‌కానిస్టేబుల్ రాథోడ్ జయవంత్‌రావు గుండెపోటుతో హఠాన్మరణం చెందాడు. జిల్లాలో అనేక సంవత్సరాలుగా సేవలందించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి ఎస్పీ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కుటుంబ సభ్యులకు జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉండి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆదర్శనగర్‌లో స్వగృహంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఉమేందర్, పోలీసు అసోసియేషన్ సభ్యులు పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలతో సంతాపం వ్యక్తం చేశారు. తక్షణ సహాయం కింద కుటుంబ సభ్యులకు రూ.20వేలు అందజేశారు. తన స్వగ్రామం చిచ్‌దరి ఖానాపూర్‌లో అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాల మధ్య పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ హెడ్ క్వార్టర్స్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నవీన్, మురళి, అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, సభ్యులు చిందం దేవిదాస్, గిన్నెల సత్యనారాయణ, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, బయోమెట్రిక్ విధానం రద్దు చేయాలని కోరుతూ మంగళవారం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అల్లూరి లోకేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు పాత పద్ధతిలోనే లేబర్ కార్డు, వెల్ఫేర్ బోర్డు ఇన్సూరెన్స్, మెటర్నిటి బెనిఫిట్స్, మ్యారేజ్ గిఫ్ట్, నేచురల్ డెత్ బెనిఫిట్స్ అందించాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ విధానం వల్ల కార్మికులు తమ పిల్లలతో మీ సేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని అన్నారు. వీరి సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజులలో జిల్లా వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బుచ్చన్న, శ్యాంరావు, ధర్మ, మోతె లక్ష్మి, సధు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉస్సు పోటీలకు ఎంపిక



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాష్ట్ర స్థాయి ఉస్సూ పోటీలకు అండర్-17 విభాగంలో కాగజ్‌నగర్‌లోని ఫాతిమా కాన్వెంట్‌కు చెందిన డి బిందుషా 36 కేజీల విభాగంలో, ట్వింకిల్ రాయ్ 40 కేజీల విభాగంలో, ఫైజాన్ 48 కేజీల విభాగంలో బంగారు పతకాలు సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి పి సాంబశివరావు తెలిపారు. ఈ నెల రెండో తేదీన మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో జరిగిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి పోటీలలో వీరు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ఆయన వివరించారు. వీరు మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని వివరించారు. వీరిని డీఈఓ అశోక్, జిల్లా క్రీడల అధికారి మీనారెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సాఫల్య, వ్యాయామ ఉపాధ్యాయులు కృష్ణప్రసాద్, ఏడుకొండలు, ఉస్సు క్రీడా శిక్షకులు దేవయ్య అభినందించారు.

ఎమ్మెల్యే కోనప్ప వెంటే ఉన్నాం



నవతెలంగాణ - బెజ్జూర్

ఎమ్మెల్యే కోనేరు కోనప్ప వెంటే తాము ఉంటామని మండలంలోని ఎలుకపెల్లి(బి) గ్రామస్తులు తెలిపారు. మంగళవారం సిద్దాపూర్, బెజ్జూర్ రోడ్డుకు భూమిపూజ చేసిన సందర్భంగా గ్రామస్తులు ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు. ఎలుకపెల్లి గ్రామంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. స్పందించి అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులంతా ఎమ్మెల్యే వెంటే ఉంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు జగ్గాగౌడ్, మాలీ సంఘం ఉపాధ్యక్షుడు రామకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

పందులను ఊరు బయట ఉంచాలని ధర్నా



కాసిపేట: సోమగూడెం గ్రామంలో పందులు అధికంగా తిరుగుతున్నాయని, దీంతో ప్రజలకు రోగాలు వచ్చే అవకాశం ఉందని, వాటిని పందుల పెంపకందారులు వెంటనే ఊరు బయట ఉంచాలని సర్పంచ్ కొరికొప్పుల ప్రమీలాగౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామస్తులు పందుల పెంపకందారుల ఇంటి ముందు ధర్నా చేశారు. సర్పంచ్ ప్రమీలాగౌడ్ మాట్లాడుతూ పందుల పెంపకందారులు వెంటనే పందులను ఊరు బయటకు తరలించి అక్కడ పందుల దొడ్డి ఏర్పాటు చేసుకొని సాదుకోవాలని సూచించారు. గ్రామంలో పందులను మేప వద్దని, దీనికి గాను ట్రాక్టర్ ఇటుక లోడ్‌తో పాటు ఇతర పందులకు ఆహారం కూడా ఇస్తానని తెలిపారు. పందులు గ్రామంలో తిరగడం వల్ల అనేక ఇబ్బందులు వస్తాయని, వెంటనే తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రమీలాగౌడ్, నాయకులు ఊరగొండ జ్యోతి, శ్రీరాముల శ్రీను, సత్తయ్య, రాజేశ్వరి, మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌లో బుధవారం ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ శ్రీకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ వైర్లు, స్తంభాలు మరమ్మతులు జరుగుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

జిల్లాకు చేరిన బతుకమ్మ చీరలు

- ఇంకా రావాల్సినవి 25వేల చీరలు
- నేటి నుండి పంపిణీకి సర్వసన్నద్ధం
- చీరల నాణ్యతపై మహిళల్లో ఉత్కంఠ

తెలంగాణ ఆడపడుచులకు అతి పెద్ద పండుగ బతుకమ్మ. మిగతా రాష్ట్రాలతో పోల్చినట్లయితే రాష్ట్రంలో ఈ పండుగను పూల పందిళ్లలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. తొమ్మిది రోజుల పాటు వివిధ రకాల పూలతో గౌరమ్మను మహిళలు కొలుస్తారు. ఇదే సందర్భంలో మహిళలు కొత్త బట్టలతో అలంకరించుకుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ కానుకగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు 6 సంవత్సరాల నుండి అందించే బతుకమ్మ చీరలు జిల్లాకు చేరాయి. అయితే రాష్ట్రవ్యాప్తంగా గతంలో కొన్ని నియోజకవర్గాల్లో మంచి చీరలు అందించి, మరి కొన్ని నియోజకవర్గాల్లో మామూలు చీరలు అందించడం పట్ల మహిళలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేయడమే కాకుండా వాటిని కొన్ని చోట్ల తగులబెట్టారు. ప్రస్తుతం అన్ని చీరలు నాణ్యమైనవని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ పంపిణీ చేసే సమయంలో వాటి నాణ్యత తెలియనుంది. ఏదేమైనా జిల్లాలో నేటి నుండి బతుకమ్మ చీరలు పంపిణీ చేయనున్నారు.

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో 1,95,065 మంది లబ్ధిదారులను అధికారులు గుర్తించారు. అయితే వీరికి ఇప్పటివరకు జిల్లాకు 1,69,454 చీరలు వచ్చాయి. వీటిని కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు వద్ద గల రాంపూర్ సమీపంలో ఉన్న గోడౌన్‌లో, కౌటాలలో, జైనూర్‌లో నిల్వ చేశారు. ఇవి వివిధ రంగుల్లో ఉన్నట్లు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. బతుకమ్మ పండుగను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నేటి నుండి బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా జిల్లాలో 1,95,065 మంది లబ్ధిదారులను గుర్తించగా 1,69,454 చీరలు జిల్లాకు వచ్చాయి. జిల్లాలోని 15 మండలాల్లో వీటిని పంపిణీ చేయనున్నారు. మండలాల వారీగా లబ్ధిదారుల సంఖ్యను చూసినట్లయితే ఆసిఫాబాద్ 20137, బెజ్జూర్ 11826, చింతలమానేపల్లి 11690, దహెగాం 10943, జైనూర్ 11034, కాగజ్‌నగర్ 40333, కెరమెరి 12120, కౌటాల 13330, లింగాపూర్ 4494, పెంచికల్‌పేట 6199, రెబ్బెన 12987, సిర్పూర్(టి) 10303, సిర్పూర్(యు) 6270, తిర్యాని 9189, వాంకిడి 13103 చీరలు పంపిణీ చేయనున్నారు.

నేటి నుండి చీరల పంపిణీ

బతుకమ్మ పండుగ ఈ నెల 14న ప్రారంభం కానున్న నేపథ్యంలో నేటి నుండి గ్రామాలు, మండలాలు, జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లో ప్రజాప్రతినిధులు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 6న ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందన్న ఊహాగానాల నేపథ్యంలో ముందుగానే చీరల పంపిణీ ప్రారంభించడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఎన్నికల కోడ్ వస్తే అంగన్వాడీ, ఆశా వర్కర్లల ద్వారా లబ్ధిదారుల ఇంటికి చీర పంపించనున్నారా లేదా నేరుగా పంపిణీ చేస్తారా అనేది ఇంకా స్పష్టత రాలేదు. అయితే ఇప్పటికే అధికారులు ఎక్కడికక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు.





అయితే జిల్లాకు ఇంకా 25611 చీరలు రావాల్సి ఉంది. ఒకటి రెండు రోజుల్లో వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

చీరల నాణ్యతపై మహిళల్లో ఉత్కంఠ

బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటిసారి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన తర్వాత బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. అప్పటి నుండి చీరల పంపిణీ చేస్తోంది. అయితే గతంలో రాష్ట్రంలో కొన్ని నియోజకవర్గాల్లో నాణ్యమైన చీరలు పంపిణీ చేసి మరి కొన్ని నియోజకవర్గాల్లో అంతగా నాణ్యతలేనివి అందించారు. దీంతో నాణ్యతలేని చీరలు తీసుకున్నవారు తమ వ్యతిరేకతను రోడ్లపైన వెళ్లగక్కారు. తీసుకున్న చీరలు ఎక్కడికక్కడ తగులబెట్టారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడానికి సిద్ధంగా ఉంచిన చీరలు ఏ విధంగా ఉండబోతున్నాయని మహిళల్లో ఉత్కంఠ నెలకొంది. ఏదేమైనా తెలంగాణ వ్యాప్తంగా ఆడపడుచులకు బతుకమ్మ కానుక పేరుతో చీరలు ఇవ్వడం బాగానే ఉన్నప్పటికీ అవి నాణ్యతతో కూడుకొని ఉండాలని కోరుకుంటున్నారు.

నేటి నుండి ప్రారంభించడానికి సన్నాహాలు : సురేందర్, డీఆర్‌డీఓ

ఇప్పటికే జిల్లాకు దాదాపు 1,64,000 చీరలు చేరుకున్నాయి. ఈ నెల 14 నుండి బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అధికారుల ఆదేశాల మేరకు నేటి నుండి పంపిణీ ప్రక్రియ ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటికే పంపిణీకి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశాం. పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా చర్యలు తీసుకుంటున్నాం.

అభివృద్ధి పథంలో పల్లెలు : ఎమ్మెల్యే జోగు రామన్న

నవతెలంగాణ-బేల

కరోనా కారణంగా ఎదురైన ఆర్థిక ఇబ్బందులను అధిగమించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. మండలంలోని మంగళవారం విస్తృతంగా పర్యటించిన ఆయన వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ముందుగ అవాల్‌పూర్ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామంలో రూ.50లక్షల నిధులతో నిర్మించనున్న శ్రీ కృష్ణాలయ నిర్మాణం కోసం భూమిపూజ చేశారు. అదేవిధంగా హనుమాన్ ఆలయ ప్రాంగణంలో అయిదు లక్షలతో ఏర్పాటు చేయనున్న షెడ్, 10లక్షలతో నిర్మించనున్న పులాజి బాబా ధ్యాన మందిర్ నిర్మాణానికి భూమిపూజ జరిపి పనులను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రభుత్వం దసరా కానుకగా మహిళలకు అందిస్తున్న చీరలను ఆడపడుచులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను పలువురు యువకులు, స్థానికులు శాలువా, పుష్పగుచ్చాలతో సత్కరించారు. అక్కడి నుండి టాక్లి గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే 10లక్షలతో నిర్మించనున్న షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం కాప్సీ గ్రామంలో హనుమాన్ మందిరం నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన తొమ్మిదేళ్ల అనతి కాలంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి బాటన నడుస్తోందన్నారు. పల్లె వాసుల ఇక్కట్లను పరిష్కరించడంలో గత ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, మారుమూల గ్రామాల్లోనూ అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయని స్పష్టం చేశారు. రైతుబంధు, రైతు బీమా, కళ్యాణలక్ష్మి, షాది ముభారక్ వంటి పథకాలు సామాన్యులకు అండగా నిలుస్తున్నాయని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు బూటకపు హామీలతో మభ్యపెట్టే ప్రయత్నాలు చేసినా అసలైన అభివృద్ధిని కళ్లకు చూపిన బీఆర్ఎస్‌కే ప్రజా మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, సర్పంచులు మినక పుష్పలత గోదావరి, గేడం అనసూయ, పార్టీ మండల అధ్యక్షుడు ప్రమోద్‌రెడ్డి, నాయకులు సతీష్ పవార్, దేవన్న, జక్కుల మధుకర్, భేదొడ్కర్ జితేందర్, తేజ్‌రావ్ మస్కే, సుదాంరెడ్డి, సోడేం సురేష్, దిలీప్ భేదొడ్కర్, సంతోష్ పటేల్, గేడం ఉద్ధవ్ పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

సామాజిక హక్కుల కోసం పోరాటం

నవతెలంగాణ-కాగజ్‌నగర్



సామాజిక హక్కుల కోసం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కృషి చేస్తోందని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు డొంగ్రి మహేశ్వర్ అన్నారు. మంగళవారం కాగజ్‌నగర్ మండలం వంజిరి గ్రామంలో కెవీపీఎస్ జెండాను ఆవిష్కరించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ మాట్లాడుతూ గ్రామాలలో దళితుల పట్ల నేటికీ వివక్ష కొనసాగుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా దళితులపై దాడులు, దౌర్జన్యాలు, కుల దురహంకార హత్యలు, సాంఘీక బహిష్కరణలు పెరుగుతున్నాయని అన్నారు. పాలకుల అసమర్థతకు ఇవి నిదర్శనాలని అన్నారు. సాంఘీక హక్కుల కోసం పోరాడిన మహనీయుల ఆశయస్ఫూర్తి కోసం అంబేద్కర్, పూలే వాదులు ఐక్యంగా పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు రత్నం రాజు, చునార్కర్ సుధాకర్, దుర్గం తుకారాం, సునీల్, విలాస్, బాబాజి, సురేష్, భీంరావు పాల్గొన్నారు.

బాసర ఆలయ హుండీ ఆదాయం రూ.72లక్షలు

నవతెలంగాణ-బాసర

సరస్వతి దేవి అమ్మవారి భక్తులు సమర్పించిన హుండీ కానుకలను మంగళవారం ఆలయంలోని 150 రూపాయల అక్షరాభ్యాసం మండపంలో ఆలయ ఈవో విజయరామారావు, దేవాదాయ శాఖ అధికారులు, పోలీస్ సిబ్బంది సమక్షంలో లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో 72లక్షల76వేల76 రూపాయల నగదు, 90 గ్రాముల 200 మిల్లీ గ్రాముల మిశ్రమ బంగారం, 3కిలోల 450 గ్రాముల మిశ్రమ వెండి, విదేశీ కరెన్సీ 22 డాలర్లు వచ్చాయని, ఈ ఆదాయం ఆలయానికి 74 రోజుల్లో సమకురినట్లు ఆలయ ఈవో తెలిపారు. హుండీ లెక్కింపులో ఆలయ సిబ్బంది, సేవా సమితి సభ్యులు, ఆలయ హోంగార్డులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను గెలిపిస్తే వాడవాడల అభివృద్ధి



నవతెలంగాణ-తాండూర్

బీఆర్ఎస్‌ను గెలిపిస్తే వాడవాడల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని వివిధ గ్రామపంచాయతీలలో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. తాండూర్‌లో రూ.50 లక్షల చొప్పున షాదిఖానా, మినీ ఇండోర్ స్టేడియం, కోటి రూపాయలతో సిసి రోడ్లు, 20లక్షలతో హెల్త్ సబ్ సెంటర్ పనులకు భూమి పూజ చేశారు. మాదారంలో 10లక్షలతో సిసి రోడ్లు, 20లక్షలతో హెల్త్ సబ్ సెంటర్ పనులకు భూమి పూజ చేశారు. కిష్టంపేట్, రాజీవ్‌నగర్, నీలాయిపల్లి, మాదారం 3 ఇంక్లైన్, రేచిని గ్రామపంచాయతీలలో 10 లక్షల రూపాయల చొప్పున అంతర్గత సిసి రోడ్ల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా పనిచేస్తుందన్నారు. పంచాయితీలలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు నిధులను వెచ్చిస్తుందని తెలిపారు. రాజీవ్‌నగర్ తాండూర్ పంచాయతీ పరిధిలోని వాడవాడల తిరిగి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పూసల ప్రణయ్ కుమార్, జెడ్‌పిటిసి బానయ్య, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు, బీఆర్ఎస్ మండల ప్రెసిడెంట్ దత్తమూర్తి దత్తాత్రేయరావు, సీనియర్ నాయకులు పురుషోత్తంగౌడ్, కోఆప్షన్ సభ్యులు ఎల్క రాంచందర్, యువ నాయకులు అంజి గణపతి పాల్గొన్నారు.



బెల్లంపల్లి చౌరస్తాలో పూలే విగ్రహాన్నే ప్రతిష్టించాలి

- కలెక్టర్‌కు బీసీ సంఘాల వినతి

నవతెలంగాణ-మంచిర్యాల

మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో మహాత్మ పూలే విగ్రహాన్ని ప్రతిష్టించాలంటూ బీసీ ఐక్యవేదిక జిల్లా నాయకులు కలెక్టర్‌కు విన్నవించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పరిపాలనాధికారికి వినతిపత్రం అందజేశారు. బెల్లంపల్లి చౌరస్తాలో మహాత్మ పూలే విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌తో మంచిర్యాల ప్రజలు 15 సంవత్సరాలుగా ఉద్యమిస్తున్నారని పేర్కొన్నారు. జిల్లా ప్రజల డిమాండ్‌ని పక్కన పెట్టడం సమంజసం కాదని తెలిపారు. బడుగు వర్గాల విద్య కోసం 150 ఏళ్ల క్రితం మహాత్మ పూలే ఉద్యమించి ఉండకపోతే నేడు మెజారిటీ వర్గాల ప్రజలు చదువు నేర్చుకోవడం, ఉన్నత పదవులు పొందడం సాధ్యమయ్యేది కాదని తెలిపారు. బెల్లంపల్లి చౌరస్తాలో వేరే విగ్రహాలు పెడితే మంచిర్యాల ప్రజల అభీష్టానికి వ్యతిరేకమే అవుతుందని తెలిపారు. మహాత్మ జ్యోతిరావు పూలేను సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు గౌరవిస్తారని వినతి పత్రంలో పేర్కొన్నారు. మహాత్మా పూలే విగ్రహాన్ని ప్రతిష్టించడంతో పాటు ఆ ప్రాంతాన్ని పూలే చౌరస్తాగా నామకరణం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక కన్వీనర్ ఒడ్డెపల్లి మనోహర్, సీనియర్ నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సింగరేణి బీసీ సంఘర్షణ సమితి నాయకులు పెద్దపల్లి కోటిలింగం, సమ్ము రాజన్న, మాడిశెట్టి విశ్వం పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల భిక్షాటన



నవతెలంగాణ-కాగజ్‌నగర్

మధ్యాహ్న భోజన పథకం కార్మికులు మంగళవారం కాగజ్‌నగర్‌లో భిక్షాటన చేపట్టారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు చేపడుతున్న సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. అయినా ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ వారు భిక్షాటన చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు వెలిశాల కృష్ణమాచారి మాట్లాడుతూ పెరిగిన వేతనాల చెల్లింపు బడ్జెట్‌తో పాటు పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని, కొత్త మెనూకు అదనపు బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ నాయకులు గిరుజాబాయి, జమున, శ్యామిలి మిస్త్రీ, శివాని హల్దార్, తనూజ బైరాగి, జంజిరాల రేఖ, సుమ, గంగుబాయి, గాయత్రి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే రోడ్లకు మహర్దశ



నవతెలంగాణ - పెంచికల్‌పేట్

బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చెందుతున్నాయని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం ఆయన మండలంలో పర్యటించారు. మండలంలోని ఎలుకపెల్లి గ్రామం నుండి పెంచికల్‌పేట్ గ్రామం వరకు రూ.94 లక్షల వ్యయంతో మంజూరైన రోడ్డు పనులకు, బొంబాయిగూడ నుండి ఎర్రగుంట గ్రామానికి రూ.రెండు కోట్ల నిధులతో మంజూరైన వంతెన, రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం మండలకేంద్రంలో యువకులు బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, సర్పంచ్‌లు జాజిమొగ్గ శ్రీనివాస్, ఉపాసి సంజీవ్, పాలె సుధాకర్, మేకల కమల, పొరిశెట్టి ఈశ్వరి, రాజన్న, ఎంపీటీసీ పేదం శారద, మండల కోఆప్షన్ సభ్యుడు సాజిద్, కాగజ్‌నగర్ మార్కెట్ చైర్మన్ కాసం శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు రాజన్న, కృష్ణ, ప్రకాష్, వెంకటి, రామన్న పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం

ఆదిలాబాద్‌టౌన్ : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కెఆర్‌కె కాలనీలోని వృద్ధుల ఆశ్రమంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి మిల్కా హాజరై కార్యక్రమన్ని ప్రారంభించారు. వృద్ధుల ఆశ్రమంలో ఉన్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేక గదులు, అందిస్తున్న ఆహారం గురించి అడుగుతూ వారితో కలిసి భోజనం చేశారు. ఈ వయసులో యోగా, వ్యాయామ కార్యక్రమాలు వృద్ధాశ్రమంలో నిర్వహించడం అభినందనీయమని సిబ్బందిని అభినందించారు. వృద్ధాశ్రమంలో ఇతరులకు ఆదర్శంగా జీవించుచున్న శకుంతల, హీరామన్ అనే వద్ధులను సన్మానించారు. షేక్ అఫ్సర్ కళాబృందంతో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, పాటలు, క్రీడా పోటీలను సెడ్స్ డైరెక్టర్ సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించి వృద్ధులను ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు, నిర్వాహకులు సురేందర్, ఆర్ సతీష్, అశోక్, నర్సిములు పాల్గొన్నారు.



వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

నవతెలంగాణ-కడెం

వన్యప్రాణుల సంరక్షణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో అటవీ అధికారులు ర్యాలీని నిర్వహించారు. సిబ్బందితో కలిసి సేవ్ టైగర్ సేవ్ నేషన్ అంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్వో అనిత మాట్లాడుతూ సమస్త జీవకోటికి ఆధారమైన, అడవి, వన్యప్రాణి రక్షణలో ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కడెం గ్రామప్రజలు, వ్యాపారస్తులు, రేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.



రంగోళి, బతుకమ్మతో కంప్యూటర్ ఆపరేటర్ల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ పంచాయతీ ఆపరేటర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరవధిక సమ్మె మంగళవారం ఐదో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా శిబిరం వద్ద ముగ్గులు, రంగోళి వేసి బతుకమ్మతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని శాఖల ఉద్యోగులకు ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పిస్తుందని, ఈ పంచాయతీ ఆపరేటర్లపై సవతి తల్లి ప్రేమ చూపించడం బాధాకరమని పేర్కొన్నారు. జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులందరికి ఆరోగ్యబీమా కల్పించి, ఆరోగ్య భద్రతను కల్పించాలని ప్రభుత్వం స్పందించేంతవరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



క్రీడలతోనే మానసికోల్లాసం

● ఎంఈఓ జి.మైసాజీ



నవతెలంగాణ-ముధోల్

క్రీడలతో శారీరక దారుఢ్యంతో పాటు మానసికోల్లాసం పెంపొందుతుందని ఎంఈఓ జి.మైసాజీ అన్నారు. మంగళవారం మండలంలోని అష్ట గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి అండర్-14 ఖోఖో పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందని అన్నారు. అండర్-14 ఖోఖో పోటీలను నిర్వహిస్తూ ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుకన్య రమేష్, ప్రధానోపాధ్యాయులు రమణారెడ్డి, తెలంగాణ ఖోఖో అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, క్రీడల జిల్లా కార్యదర్శి రమణారావు, పేట సెక్రటరీ కె.భోజన్న, పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అన్నేలా మల్లారెడ్డి, మండల అధ్యక్షుడు పత్తిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, బాసర మండల ప్రధాన కార్యదర్శి పి.రవీందర్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షులు సాయిరెడ్డి, సభ్యులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

లింగాపూర్ మండల కేంద్రం ఏర్పాటును ఉపసంహరించుకోవాలి

నవతెలంగాణ-కడెం

మండల పరిధిలోని లింగాపూర్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయడం కోసం పలువురు స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని రైతు మండల అధ్యక్షుడు ఆపాత్ రాజేందర్ ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయా గ్రామాల ప్రజలు తెలంగాణ తల్లి విగ్రహం నుంచి స్థానిక తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వ్యాపారస్తులు మాట్లాడుతూ మండల పరిధిలోని లింగాపూర్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేస్తే కడెం మండలంలోని పలు గ్రామాలు ఉపాధి కోల్పోయి రోడ్డున పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే దస్తురాబాద్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేయడంతో పలువురు వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి లింగాపూర్ మండల కేంద్రం ఏర్పాటను ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కట్ట శ్యామ్ సుంధర్, హపవత్ రాజేంధర్, కృష్ణ, రవితేజ, మహిపాల్, రాజేష్, ఆనంద్‌గౌడ్, వాజిద్ ఖాన్, వెంకటేష్, బబ్లు పాల్గొన్నారు.

నేషనల్ ఎక్స్‌పోలో ఫొటోగ్రాఫర్లు పాల్గొనాలి



నవతెలంగాణ-తాంసి

హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో ఈనెల 6, 7, 8 తేదీల్లో నిర్వహిస్తున్న నేషనల్ ఎక్స్‌పో ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీలో అందరూ తప్పకుండా హాజరై కెమెరాల వినియోగంపై అవగాహన పెంచుకోవాలని ఫోటోగ్రఫీ మండల యూనియన్ అధ్యక్షులు చింతలపల్లి నరోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో వీడియో ఫోటోగ్రఫీ సభ్యులతో కలిసి తాంసి ఎస్సై శివరాం చేతుల మీదుగా ఎక్స్‌పో సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానికి అనుకూలంగా వీడియో ఫోటోగ్రఫీ సభ్యులు కెమెరాల కొనుగోలు ఉపయోగంపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. దానికి సంబంధించినది ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా నేషనల్ లెవెల్ ఎక్స్‌పోను హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ ప్రదర్శనలో వివిధ రకాల కెమెరాలను ఉంచడంతో పాటు వాటి వినియోగం గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు సంతోష్, ఫోటోగ్రఫీ యూనియన్ సభ్యులు కిరణ్, శ్రీనివాస్, ఏఎస్సై స్వామి ఉన్నారు.

ఆస్పత్రిలోని సమస్యలు పరిష్కరించేందుకు కృషి



నవతెలంగాణ-తలమడుగు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కమిటీ సమావేశానికి ఎంపీపీ కళ్యాణం లక్ష్మి, జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. పీహెచ్‌సీలో సిబ్బంది, మందుల కొరత, ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలపై చర్చించారు. శిథిలావస్థలో ఉన్న భవనానికి మరమ్మతు కొరకు జిల్లా పరిషత్ నిధులు 15వ ఫైనాన్స్ నుంచి రూ.3లక్షల మంజూరు చేసినట్టు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న సమస్యలపై జిల్లా వైద్యాధికారిని కలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమాకాంత్, డాక్టర్ హరీశ్, ఆయుష్ డాక్టర్ రమాకాంత్, నాయకులు వెంకన్న, గంగారాం, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రధాని సభకు తరలిన నాయకులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నిజామాబాద్‌లోని ఇందూర్‌లో జరగనున్న సభకు మండలం నుంచి భారీగా కమలం అభిమానులు తరలి వెళ్లారు. ఇంద్రవెల్లి జెడ్పీటీసీ అర్క పుష్పలతతో పాటు మండల అధ్యక్షులు అరెల్లి రాజలింగం ఆధ్వర్యంలో శంకర్ గూడ, దేవాపూర్, ఏమాయికుంట, తదితర గ్రామాల నుంచి కార్యకర్తలు నాయకులు తరలివెళ్లారు.

104 ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు



మాట్లాడుతున్న మల్లేష్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

104 ఉద్యోగులు తమ సమస్యల పరిష్కరించాలని మంగళవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రిలే నిరహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను మంగళవారం సీపీఐ(ఎం) జిల్లా ప్రధాన కార్యదర్శి దర్శనాల మల్లేష్, సీఐటయూ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాధీనంలో పని చేస్తున్నప్పటికీ, వేతనాలు ఏజెన్సీల ద్వారా చెల్లించడం వలన సకాలంలో వేతనాలు అందడం లేదన్నారు. ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా ఉద్యోగుల ఖాతాలో ట్రెజరీ ద్వారా వేతనాలు జమ చేయాలన్నారు. ఉద్యోగులు కరోనా సమయంలో సేవలందించారని, 104 ఎఫ్డిహెచ్ఎస్ ఉద్యోగులు రెగ్యులరైజేషన్‌కు అర్హతలు కలిగి ఉన్నప్పటికీ ప్రభుత్వం రెగ్యులర్ చేయడం లేదన్నారు. జీఓ నెం. 60 ప్రకారం ఉద్యోగులకు స్లాబ్ పద్ధతిన వేతనాలు చెల్లించడం వలన తాము తీవ్రంగా నష్టపోతున్నామన్నారు. 104 ఎల్డీహెచ్ఎస్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించుటలో ఏజెన్సీ విధానాన్ని రద్దు చేసి, ప్రభుత్వమే ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలన్నారు. 104 ఎఫ్డిహెచ్ఎస్ ఉద్యోగులకు "సమాన పనికి సమాన వేతనం" చెల్లించాలని, 104 ఎల్డీహెచ్ఎస్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని అన్నారు. 104 ఏఎన్ఎంలను రెండో ఏఎన్ఎంలుగా గుర్తించి, రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. 104 ఎఫ్డిహెచ్ఎస్ ఉద్యోగులకు వారు ఇచ్చిన ఆప్షన్ ప్రకారం సొంత జిల్లాలకు బదిలీ చేయాలని హెల్త్ కార్డు, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలన్నారు. సాధారణ సెలవులు, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా అన్నిరకాల సెలవులు అమలు చేయాలన్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను కంప్యూటర్ ఆపరేటర్లుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు నవీన్ కుమార్, కార్యనిర్వహణ అధ్యక్షులు మామిడి వెంకన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆనంద్, 104 ఉద్యోగులు సురేందర్, ప్రశాంత్, విర కేశవులు, ఇబ్రహీం, పురుషోత్తం, శ్రీదేవి, జ్యోతి పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు నిర్ణీత వేతనాలు చెల్లించాలి

● ఖానాపూర్‌లో ఆశా వర్కర్ల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

నవతెలంగాణ-ఖానాపూర్

ఆశా వర్కర్లకు నిర్ణిత వేతనం రూ.18వేలు చెల్లించాలని, ఈఎస్ఐ ప్రమాదబీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరుతూ మంగళవారం ఆశా వర్కర్లు ఖానాపూర్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీగా ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకునికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు పి.గంగామణి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశా వర్కర్లు అనేక పోరాటాలు చేశారని అన్నారు. 106 రోజుల సమ్మె, రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్రలు కూడా నిర్వహించారని అన్నారు. అయినా ప్రభుత్వ స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశాలకు పని భారం తగ్గించాలని జాబ్స్ విడుదల చేయాలని అన్నారు. 2021 జులై నుంచి డిసెంబర్ వరకు ఆరు నెలల పీఆర్సీ, ఏరియర్స్ వెంటనే చెల్లించాలన్నారు. కేంద్రం చెల్లించిన కరోనా రిస్క్ అలవెన్సులను నెలకు రూ.వెయ్యి చొప్పున 16 నెలలు బకాయి డబ్బులు వెంటనే చెల్లించాలన్నారు. 32 రకాల రిజిస్టర్‌లను వెంటనే ప్రింట్ చేసి ప్రభుత్వం సప్లై చేయాలన్నారు. ఆశాలకు ప్రసూతి సెలవులు సర్కులర్‌ను వెంటనే జారీ చేయాలన్నారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ మండల అధ్యక్షులు రజిత, కార్యదర్శి కమల, పెంబి అధ్యక్షులు వినోద, కార్యదర్శి మమత, కడం జ్యోతి, కార్యదర్శి, గంగరాజు దస్తురాబాద్ అధ్యక్షులు అనసూర్య, కార్యదర్శి మంజుల, ఉట్నూర్ అధ్యక్షులు శోభ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేంత వరకూ పోరాడుతాం



సమ్మె శిబిరంలో అంగన్‌వాడీలతో కలిసి నినాదాలు చేస్తున్న కిరణ్

నవతెలంగాణ-బేల

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాడుతామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. మంగళవారం మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెకు మద్దతు తెలిపి సమ్మె శిబిరంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు రోజులుగా తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మధ్యాహ్న భోజన కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాడుతుంటే ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం స్తంభించినా కూడా రాష్ట్ర ప్రభుత్వం చూసి చూడనట్లుగా వ్యవహరించడాన్ని సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. 2022 అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా మార్చి 15వ తేదీ నాడు తెలంగాణ సీఎం కేసీఆర్ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు రూ.2వేల వేతనాన్ని అదనంగా పెంచుతూ అసెంబ్లీ సాక్షిగా హామీలు ఇచ్చారు. అనేక పోరాటాల ద్వారా 2023 మార్చిలో జీవో నెంబర్ 8 వచ్చిందని అన్నారు. జీఓ వచ్చి ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు దాన్ని అమలులోకి తీసుకురాలేదని అన్నారు. గత ఆరు నెలలుగా పెండింగ్ బిల్లులను చెల్లించలేదన్నారు. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యమే మధ్యాహ్న భోజన పథక కార్మికులను సమ్మెలోకి తీసుకువచ్చిందని అన్నారు. ప్రభుత్వం వెంటనే మధ్యాహ్న భోజన పథకం రాష్ట్ర నాయకత్వంతో చర్చలు జరిపి న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేయాలని అన్నారు. పెరిగిన వేతనాలను 2022 మార్చి నుంచి ఏరియర్స్‌తో సహా చెల్లించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేసి కార్మికుల ఖాతాలో జమ చేయాలన్నారు. వంట షెడ్డుల నిర్మాణం చేపట్టాలని అన్నారు. వంట పాత్రలను, గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వమే సప్లై చేయాలని అన్నారు. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా మినీ చార్జీలను పెంచి కోడిగుడ్లను ప్రభుత్వమే సప్లై చేయాలని అన్నారు. యూనిఫామ్‌లను పంపిణీ చేయాలన్నారు. రూ.10లక్షల ప్రమాద బీమాతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్ సౌకర్యాలు కల్పించాలని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, ప్రగతి భవన్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రేఖ, సంగీత, లక్ష్మీ, కిష్టమ్మ పాల్గొన్నారు.

'బీజేపీ, కాంగ్రెస్ అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం'



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళా సమాజం తలదించుకునే విధంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు స్వరూపరాణి అన్నారు. మంగళవారం జరిగిన ఓ చానెల్ డిబేట్‌లో ఎమ్మెల్యే జోగు రామన్నను ఉద్దేశించి గండ్రత్ సుజాత చేసిన వ్యాఖ్యలను మహిళా నాయకురాళ్లు తీవ్రంగా ఖండించారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆదిలాబాద్ గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి కొనసాగుతుందని తెలియజేశారు. 60 ఏండ్ల పాలనలో కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించినందుకు ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ఇటువంటి విమర్శలకు పాల్పడుతున్నారని అన్నారు. మరోసారి ఇటువంటి వ్యాఖ్యలు పునరావృతం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. బీజేపీ నాయకుడు పాయల శరత్‌పై అక్రమ కేసులు పెడుతున్నారంటూ పాయల శంకర్ చేసిన వ్యాఖ్యలను సైతం ఖండించారు. రౌడీయిజం చేస్తూ పోలీసులకు ఎదురుతిరిగితే ఖచ్చితంగా కేసులు పెడతారని, అందులో ఎమ్మెల్యేకు ఎటువంటి సంబంధం ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో మహిళ కార్యదర్శి బొడగం మమత, పర్వీన్, రమ పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగింత

నవతెలంగాణ-జైనథ్

గుర్తుతెలియని మృతదేహన్ని పోలీసులు గుర్తించి, రిమ్స్‌కు తరలించారు. కాగా కుటుంబీకులు మంగళవారం పోలీసులను సంప్రదించగా మహారాష్ట్రకు చెందిన వ్యక్తిగా పేర్కొన్నారు. మృతుడి మహరాష్ట్ర దిగ్రస్ తాలుకా రాంబౌ గ్రామానికి చెందిన బాన్సోడి దత్తు(52)గా గుర్తించారు. వారి కుటుంబ సభ్యులు పూర్తి వివరాలు తెలియజేయడంతో పోలీసులు మృతదేహన్ని అప్పగించారు.



విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు వాడటం, విక్రయించడం నేరం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యాసంస్థలకు వందగజాల పరిధిలో పొగాకు ఉత్పత్తులను వాడటం నేరమని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భగవాండ్లు అన్నారు. జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను పొగాకు రహిత విద్యాసంస్థలుగా ప్రకటించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పొగాకు ఉత్పత్తులకు, ధూమపానానికి, మాదక ద్రవ్యాలు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. పాఠశాలలకు 100 గజాల పరిధిలో గల దుకాణాల్లో పొగాకు ఉత్పత్తులు విక్రయించడం పొగాకు రహిత విద్యాసంస్థల నియమావళి ప్రకారం నేరమన్నారు. నియమావళిని ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్, కళాశాల అధ్యాపకులు, పొగాకు నియంత్రణ విభాగం సోషల్ వర్కర్ చిరంజీవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బీఎస్పీ జెండా పండుగ



నవతెలంగాణ-తలమడుగు

బీఎస్పీ జెండా పండుగను మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బీఎస్పీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడుగు మహేందర్, లక్ష్మణ్ యాదవ్, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ మెస్రం జంగుబాపు ముఖ్యఅతిధులుగా హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి అగ్రకుల పార్టీలు చేసిన మోసపూరిత వాగ్దానాలకు, అనాదిగా అణచివేతకు గురవుతున్నామన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీలు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో భాగస్వాములు అయినప్పుడే వారి బ్రతుకులు బాగుపడతాయని తెలిపారు. బీఎస్పీ అధికారంలో వచ్చినప్పుడే సాధ్యం అవుతుందన్నారు. సామజిక న్యాయం కోసం బీఎస్పీ నిరంతరం పోరాడుతుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీకాంత్, సంయుక్త కార్యదర్శి పోశెట్టి, తలమడుగు అధ్యక్షులు పెగ్గెర్ల అరవింద్, ప్రసాద్, రాములు, వినోద్, గంగన్న, ప్రేమ్‌కుమార్, రవి పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడి నిరసన

నవతెలంగాణ-కడెం



మధ్యాహ్న భోజన కార్మికులు తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రాధ, కడెం మండల అధ్యక్షురాలు లత, ప్రధాన కార్యదర్శి సత్యవ్వ, కోశాధికారి వెంకవ్వ, మండలంలోని ఆయా పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

20శాతం మధ్యంతర భృతి ప్రకటించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

20శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శివన్న మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏదైతే 5శాతం ఐఆర్ ప్రకటించిందో అది సరైనది కాదని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఐఆర్ 20శాతం ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్లో ఉన్న మూడు డీఏలు కూడా చెల్లించాలని, అలాగే పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్స్ గాని జీపీఎఫ్ నిధులు వెంటనే విడుదల చేయాలని కోరారు.

రేపు వివేకానంద విగ్రహావిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువతకు స్ఫూర్తిని అందిస్తున్న స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ వేడుకలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్నట్టు మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ తెలిపారు. పట్టణంలోని వివేకానంద చౌక్‌లో కూడలి సుందరీకరణ పనులు తుది దశకు చేరుకున్న నేపథ్యంలో మంగళవారం పనుల తీరును పర్యవేక్షించారు. ఈనెల 5న స్వామి వివేకానంద విగ్రహావిష్కరణ వేడుకలను అట్టహాసంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. ఆదిలాబాద్ పట్టణ నడిబొడ్డున స్వామి వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, ఎమ్మెల్యే జోగు రామన్న చేతుల మీదుగా కార్యక్రమం ఘనంగా జరగనుందని పేర్కొన్నారు. ఈ వేడుకలకు పెద్ద ఎత్తున యువత, స్వచ్ఛంద సంస్థలు, తరలిరావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా వినాయక్‌చౌక్ నుంచి తెలంగాణ తల్లి కూడలి వరకు ఏర్పాటు చేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టంను సైతం ప్రారంభించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో యువజన సంఘాల జిల్లా అధ్యక్షులు బాల శంకర్ కృష్ణ, విగ్రహ శిల్పి ఊరే గణేష్, భారత జాగృతి జిల్లా అధ్యక్షులు రంగినేని శ్రీనివాస్, పసుపుల రాజు, అజీజ్, శ్రీకాంత్, శివకుమార్, సాయి, రవికుమార్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని ఆదివాసీ గ్రామం టీవీటీ, పరుపులపల్లె, గ్రామానికి గ్రావెల్ రోడ్డు పనులను మంగళవారం ఎంపీపీ తుల శ్రీనివాస్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. అలాగే ఐటీడీఏ నిధులతో మంజూరైన రూ.10లక్షల నిధులతో మంజూరు అయిందని అన్నారు. రోడ్డు పనులతో పాటు కల్వర్టు నిర్మించడం జరుగుతుందన్నారు. ఆదివాసీ గ్రామాలకు ఐటీడీఏ నిధులతో ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించామని అన్నారు. అలాగే మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జుగ్నాక్ మారుతి, ఎంపీటీసీ సిడం శంబు, పటేల్ గంగాధర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనసు తెలుగు దినపత్రిక
3
కుమురంభీం ఆసిఫాబాద్
బుధవారం | అక్టోబర్ 04, 2023 | www.navatelangana.com

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



జాతీయ వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాల, ఎల్లూర్ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పెంచికల్‌పేట్ అటవీ శాఖ రేంజ్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించినట్టు డిప్యూటీ రేంజ్ అధికారి ప్రభాకర్ తెలిపారు. అడవులు, అడవి జంతువుల ప్రాముఖ్యతపై విద్యార్థులు చిత్రలేఖనం పోటీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి రమాదేవి, సెక్షన్ అధికారి జగన్మోహన్‌గౌడ్, బీట్ అధికారులు వెంకటేశ్, అరుణ్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు యాదగిరి, ఉపాధ్యాయులు భానుప్రకాష్, నాగేష్, సుమతి, శ్రీధర్ పాల్గొన్నారు.

గోలేటి నియర్‌బై పవర్ లిఫ్టింగ్ పోటీలు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటిలోని సీఈఆర్ క్లబ్‌లో(డబ్ల్యుబీఎస్ అండ్ జీఎ) 90 వార్షిక క్రీడాపోటీల్లో భాగంగా సీఈఆర్ క్లబ్‌లో మంగళవారం బాడీబిల్డింగ్ మెస్ అండ్ వెయిట్ లిఫ్టింగ్ మెస్, పవర్ లిఫ్టింగ్ మెస్ అండ్ డీమెస్ నియర్ బై పోటీలను బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్ ప్రారంభించారు. మొదట హనుమాన్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజ చేశారు. ఈ పోటీల్లో మందమర్రి, బెల్లంపల్లి ఏరియాలోని ఉద్యోగ క్రీడాకారులు పాల్గొననున్నారు. బాడీబిల్డింగ్ మెస్ అండ్ పవర్ వెయిట్ లిఫ్టింగ్ మెస్, డీమెస్ నియర్ బై పోటీల్లో ప్రథమస్థానాల్లో నిలిచిన ఉద్యోగ క్రీడాకారులు కంపెనీ స్థాయిలో పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, డీవైపీఎం రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పీఓ ప్రశాంత్, స్పోర్ట్స్ సూపర్‌వైజర్ అశోక్, బెల్లంపల్లి ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ మురహరిరావు, జనలర్ క్యాప్టెన్ చంద్రకుమార్, మందమర్రి ఏరియా స్పోర్ట్స్ కోఆర్డినేటర్ రవికుమార్, జనరల్ క్యాప్టెన్ చిన్నన్న పాల్గొన్నారు.

నిద్రావస్థలో వైద్యారోగ్య శాఖ

- జ్వరాలతో పిట్టల్లా రాలుతున్న జనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- కొత్మీర్‌లో గ్రామంలో ఇద్దరు మృతి
- విజృంభిస్తు విషజ్వరాలు

నవతెలంగాణ-దహెగాం

వైద్యారోగ్య శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలా మారుతున్నాయి. గ్రామాల్లో వైద్యాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో విష జ్వరాల బారిన పడి ప్రజలు ప్రాణాలు విడుస్తున్నారు. 15 రోజుల వ్యవధిలోనే కేవలం కొత్మీర్ గ్రామంలో విష్ణువర్ధన్ అనే నాలుగు సంవత్సరాల బాలుడు మృతిచెందగా ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన మిట్ట నాగరాజు(24) డెంగ్యూ జ్వరంతో ప్రాణాలు కోల్పోయాడు.

పెరుగుతున్న జ్వర పీడితుల సంఖ్య

అసలే సీజనల్ వ్యాధులు ముంచుకొస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా జ్వర పీడితులు రోజురోజుకు పెరిగిపోతున్నారు. ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యటించి ప్రజా ఆరోగ్యంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు చుట్టపుచూపుగా వచ్చిపోతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. చిన్నాచితక వ్యాధులకు ప్రయివేటు వైద్యుల వద్దకు వెళ్లి అప్పుల ఊబిలో చిక్కుకుపోతున్నామని వాపోతున్నారు. మండలంలోని కొత్మీర్ గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలుడు 15 రోజుల క్రితం మృతిచెందినట్టు గ్రామస్తులు పేర్కొంటుండగా ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన యువకుడు డెంగ్యూ జ్వరంతో రక్తకణాలు పడిపోయి, పచ్చకామెర్లు సోకడంతో తీవ్ర అస్వస్థకు గురయ్యాడు. కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉండగా గ్రామంలో ఇంకా చాలా మంది జ్వర పీడితులు జ్వరంతో మంచాన పడి ఉన్నారని ప్రజలు చెబుతున్నారు.

పేరుకే ప్రభుత్వ ఆస్పత్రులు

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నప్పటికీ వైద్యులు సరిగా ఉండకపోవడం, సరైన వైద్య పరికరాలు, మందులు అందుబాటులో లేకపోవడంతో ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలు అంతగా ఆసక్తి కనబరచడంలేదు. ప్రభుత్వం సైతం పెద్దగా పట్టించుకోకపోవడంతో సంబంధిత అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు సైతం జిల్లావ్యాప్తంగా చాలాచోట్ల ఇన్‌చార్జీలుగా ఉండడంతో ఎప్పుడో ఒక రోజు చుట్టపుచూపుగా విధులకు హాజరవుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా గ్రామాల్లో హెల్త్ క్యాంపులు పెట్టి ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులు అందించాల్సిన అధికారులు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో



ప్రజలు ప్రయివేటు ఆస్పత్రులకు, డబ్బులు లేని వారు ఇంటి వద్దనే ఉండి ఆర్ఎంపీలను సంప్రదించి ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. కేవలం మండలంలోని కొత్మీర్ గ్రామంలో ఇటీవల జరిగిన రెండు సంఘటనలే కాకుండా పెంచికల్‌పేట్, బెజ్జూర్, కౌటాల మండలాలతో పాటు జిల్లా వ్యాప్తంగా రెండు నెలల వ్యవధిలో పదుల సంఖ్యలో ప్రజలు విష జ్వరాల బారినపడి మరణించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ వైద్యారోగ్య శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికీ కూడా ప్రత్యేక చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని ఆరోపిస్తున్నారు. వెంటనే ప్రభుత్వం ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నారు.

ఆర్డీఓ రాజేశ్వర్ మృతి తీరని లోటు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాగజ్‌నగర్ ఆర్డీఓ రాజేశ్వర్ హఠాన్మరణం తీరని లోటని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కోవలక్ష్మి అన్నారు. మంగళవారం ఉదయం ఉట్నూర్‌లో గుండెపోటుతో హఠాన్మరణం చెందిన ఆర్డీఓ రాజేశ్వర్‌కు కలెక్టరేట్‌లో రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయన మృతి రెవెన్యూ విభాగానికి తీరని లోటు అన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ అహ్మద్, డీపీఓ సురేందర్, డీటీడీఓ రమాదేవి, ఎంపీడీఓ శశికళ పాల్గొన్నారు.

రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో

తెలంగాణ రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆవరణలో ఆర్డీఓ రాజేశ్వర్ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ రఫత్ హుస్సేన్, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం కలెక్టరేట్ ఎదుట 104 ఉద్యోగులు సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 వాహనాలను రద్దు చేయడం దారుణం అన్నారు. గతంలో ఈ వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలకు రక్త పరీక్షలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేసే వారిని గుర్తు చేశారు. వాహనాలను రద్దు చేయడంతో ఇందులో పనిచేసే ఉద్యోగులను పీహెచ్‌సీ లతోపాటు ఇతర ప్రాంతాల్లో సర్దుబాటు చేశారని ఇది జరిగి 22 నెలలు పూర్తయినప్పటికీ ఉద్యోగ భద్రత కల్పించలేదన్నారు. ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించకుండా వెట్టిచాకిరి చేయిస్తున్నారని అన్నారు. ఏజెన్సీ విధానం రద్దుచేసి ట్రెజరీ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల పరిష్కారం కోసం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్, రాజేశం, జిల్లా కార్యదర్శి మల్లేష్, ప్రశాంత్ గౌడ్, రమేష్, దేవాజి, లతా, సురేఖ, తిరుమల, లీలావతి, శ్రీదేవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆశా వర్కర్ల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ డిమాండ్లు పరిష్కరించాలని ఆశ వర్కర్లు గత తొమ్మిది రోజులుగా చేస్తున్న నిరసనలో భాగంగా 9వ రోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ మాట్లాడుతూ ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోకుంటే మరో పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు హెచ్చరించారు. కనీస వేతన స్థిర వేతన విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకొని సమ్మె విరమించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంబాల ఓదెలు, ఆశా వర్కర్ల సంఘం జిల్లా నాయకులు అమరవాణి, పూజ, దేవత, దేవి, సంకు, లక్ష్మి, అరుణ, రేణుక, లావణ్య, విజయ, సుమిత్ర, భారతి, మోతుబాయి, స్వప్న పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ పండుగను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల రాష్ట్ర రాజధానిలోని ఎల్‌బీకేబీఆర్ కన్వెన్షన్ హాలులో నిర్వహించనున్న ఫొటోగ్రాఫర్స్ పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఫొటోగ్రాఫర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దోండ అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో జైనూర్ ఎస్సై సందీప్‌కుమార్ ఫొటో ఎక్స్‌పో పోస్టర్లను విడుదల చేశారు. ఫొటోగ్రఫీ ద్వారా పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అలాంటి ఫొటోగ్రఫీ పండుగ కోసం ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలకు ఫొటోగ్రఫీని ప్రోత్సహించడానికే రాష్ట్ర రాజధానిలోని ఎల్‌బీ క్యాబిన్ ఫంక్షన్‌హాలులో ఈ నెల ఆరు, ఏడు, ఎనిమిది తేదీల్లో ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జైనూర్ ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఆత్రం మాధవరావు, ఆత్రం రాము, గిరేసుదామ్ పాల్గొన్నారు.

మధ్యాహ్నభోజన కార్మికుల భిక్షాటన



వాంకిడిలో..

నవతెలంగాణ-వాంకిడి

తమ సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్నభోజన కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించడంలేదని, పెరిగిన ధరలకు అనుగుణంగా అప్పులు చేసి పాఠశాలల విద్యార్థులకు మధ్యాహ్నభోజనం నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు పాల్గొన్నారు.

దహెగాం : భోజనం పెట్టిన చేతులతోని భిచ్చమెత్తుకోవాల్సిన దుస్థితి నెలకొందని మధ్యాహ్నభోజన కార్మికులు ఆవేధన వ్యక్తం చేశారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్నభోజన కార్మికులు ఆరో రోజు సమ్మెలో భాగంగా భిక్షాటన చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమ న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలన్నారు. పెరిగిన వేతనాన్ని చెల్లించాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్‌ను కేటాయించాలని, గ్యాస్ సబ్సిడీని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం నాయకులు లలిత, శంకరమ్మ, లక్ష్మీ, పార్వతి, విజయ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ : మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం జిల్లా నాయకుడు సోపాన్ అన్నారు. మంగళవారం జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలకేంద్రంలో నిర్వహిస్తున్న సమ్మె కార్యక్రమంలో భాగంగా కార్మికులు మార్కెట్‌కు వెళ్లి భిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

రెబ్బెన : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు గత ఆరు రోజులగా మధ్యాహ్నభోజన కార్మికుల చేపట్టిన సమ్మెలో భాగంగా మంగళవారం భిక్షాటన చేసి నిరసనతెలిపారు. సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు(సీఐటీయూ) ఎ ఓదెలు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ మంత్రి హరీష్‌రావు మధ్యాహ్నభోజన కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని, బిల్లులు వెంటనే విడుదల చేస్తామని పేపర్‌కు ప్రకటనలు ఇవ్వడం తప్పా ఇంతరకు మధ్యాహ్నభోజన కార్మికులకు వేతనాలు పెంచలేదన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి పాగిడి మాయ, తానుబాయి, రాజేశ్వరి, కమలాబాయి, నికోడె తానుబాయి, శాంత, లక్ష్మీ, రాంటెంకి విజయ పాల్గొన్నారు.



దహెగాంలో..

20 శాతం ఐఆర్ ప్రకటించాలి



ఆసిఫాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే 20 శాతం ఐఆర్ ప్రకటించాలని టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కనక వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. మంగళవారం జైనూర్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి ఉపాధ్యాయ సంఘాలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతి తక్కువ ఐదు శాతం ఐఆర్ ప్రకటించడానికి, పెండింగ్‌లో ఉన్న డీఏలు ప్రకటించకపోవడం సిగ్గుచేటన్నారు. అన్ని పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో నిర్వహిస్తున్న యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుల సంఘాల నాయకులు ఆంద్రయ్య, మోహన్, జగ్జీవన్, కవిత, కైలాష్, శంకర్, విజయ, శాంతారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజంలో చదువుతోనే గౌరవం

తాంసి : ఇప్పుడున్న సమాజంలో చదువుతోనే ఎక్కడైనా గౌరవం ఉంటుందని తహసీల్దార్ లక్ష్మి అన్నారు. మంగళవారం మహిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని కప్పర్ల, పొన్నారి, పాలోడి, తాంసి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న నిరుపేద విద్యార్థులకు బ్యాగులను, అధికారులు, ప్రజాప్రతినిధులు చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ముఖ్యంగా 18 సంవత్సరాలు లోపు పిల్లలు ఇంట్లో ఉండకుండా పాఠశాలకు వచ్చి చదువుకోవాలని, చదువుకుంటేనే సమాజంలో గౌరవంతో పాటు తల్లిదండ్రులకు గౌరవంగా ఉంటుందని అన్నారు. ఉపాధ్యాయులను గురువుగానే భావించాలని మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చదువు మానేసిన పిల్లలను గుర్తించి, వారిని మళ్లీ చదువుపై దృష్టి పెట్టే విధంగా చేయడం నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు ఉచితంగా అందించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ రవీందర్, ప్రధానోపాధ్యాయులు శ్రీకాంత్, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ నర్మద, ఏఎస్సై స్వామి, ఎస్ఎంసీ చైర్మెన్ విలాస్, సర్పంచులు అశోక్, శంకర్, మహిత మండల కోఆర్డినేటర్ ఇమ్రాన్‌ఖాన్, సభ్యులు సుజాత ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో మంగళవారం శ్రీ కొత్తపల్లి వెంకటలక్ష్మి చంద్రయ్య మెమోరియల్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 25 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఏడుగురిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరికి లయన్స్ క్లబ్, బెల్లంపల్లి వారి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్-అనిత తెలిపారు. ఈ కార్యక్రమంలో అఫ్తామలజిస్ట్ గోపి, వసీ పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలి

నవతెలంగాణ-నార్నూర్

తమకు ప్రభుత్వం కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని తమ డిమాండ్లను పరిష్కరించే వరకు సమ్మె చేస్తామని అంగన్‌వాడీలు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో నిరవధిక సమ్మెలో భాగంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు మాట్లాడుతూ గత 46 సంవత్సరాలపైగా ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ సేవలందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర చట్టబద్ధ సౌకర్యం కల్పించాలన్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో అంగన్‌వాడీ జాదవ్ పంచశీలా, పంచపూల, రాథోడ్ సావిత్రి, రాథోడ్ స్యామక, పంచుబాయి, చాయ, మాయ, రత్న మీరాబాయి, సునీతతో పాటు వివిధ గ్రామాల అంగన్‌వాడీలు ఉన్నారు.

5న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఈ నెల 5న జిల్లా కేంద్రంలోని జెడ్పి సమావేశ మందిరంలో ఉదయం 11గంటలకు మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి మిల్కా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, రిమ్స్ వైద్య సిబ్బంది అధ్వర్యంలో ఉదయం 9గంటలకు మెడికల్ క్యాంపు ఉంటుందన్నారు.

ఆస్పత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆస్పత్రి శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటిగార్డ్‌లకు కనీస వేతనం ఇచ్చి వారు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కార్మికులతో కలిసి ఆసిఫాబాద్ ఆస్పత్రి సూపరిండెంట్ ఆదికేశవులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని సీహెచ్‌సీ ఆసుపత్రిలో గత అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్ కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని అన్నారు. గత 20 సంవత్సరాల నుంచి చాలిచాలని వేతనాలు తీసుకుంటూ ఆసుపత్రికి వచ్చే వారికి సేవ చేస్తున్నారని అన్నారు. వీరంతా శ్రమదోపిడికి గురవుతున్నారని విమర్శించారు. పెండింగులో ఉన్న వేతనాలు ఇవ్వాలని, ఈపీఎఫ్ వివరాలు తెలియజేయాలని, ప్రతి నెల 5వ తేదీ లోపు వేతనాలు ఇవ్వాలని, పనిభారం తగ్గించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, సిబ్బంది మల్లేష్, హరీష్, మమత పాల్గొన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

- సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ భవన నిర్మాణానికి భూమిపూజ



నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలోని గన్నారంలో ఐటీడీఏ నిధులు రూ. ఐదు కోట్లతో ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాల సముదాయ అదనపు భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో 10 వేల మంది విద్యార్థులు రెసిడెన్షియల్ విద్యాభ్యాసం చేస్తున్నారని తెలిపారు. గన్నారం రెసిడెన్షియల్ స్కూల్ ప్రారంభంలో అరకొర వసతులు ఉండేవన్నారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో భవన నిర్మాణం చేపట్టడం జరుగుతోందన్నారు. నిర్మాణ పనులను ఆరు నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తా వివరించారు. స్టాఫ్‌కు క్వార్టర్లు సైతం అందుబాటులోకి తెస్తామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని మౌళిక వసతులు కల్పిస్తామని, విద్యార్థులు, ఉపాధ్యాయులు తమ చదువులపై దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎంపీపీ చీపురుశెట్టి శంకర్, సర్పంచ్ దోతుల శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రమ్య, ఐటీడీఏ డీఈ నిరంజన్ రావు, ఏఈ భద్రోద్దీన్, సర్పంచులు బొట్లకుంట మల్లేష్, పురుషోత్తం, నాయకులు గజ్జి రామయ్య, గజ్జి లింగయ్య పాల్గొన్నారు.

15న 5కే రన్ పోస్టర్ల విడుదల



నవతెలంగాణ-సిర్పూర్(టి)

క్విట్ పౌండేషన్ కుల, మత, ప్రాంత బేదం లేకుండా ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఆరోగ్య భారత్ నిర్మాణమే ధ్యేయంగా పనిచేస్తూ రన్ టు రీడ్, రీడ్ టు లీడ్ అనే కాన్సెప్ట్‌తో కార్యక్రమాలు చేపడుతుందని క్విట్ ఇండియా పౌండేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుస్స కుమార్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 5కే రన్ పోస్టర్‌ను ఎస్ఐ దీకొండ రమేష్, ప్రిన్సిపల్ కళ్యాణి చేతుల మీదుగా గోడప్రతులను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే రన్ ఫర్ కంట్రీలో భాగంగా మన ఓటు మన భవిష్యత్ అనే లక్ష్యంతో కాగజ్‌నగర్ పట్టణంలో ఈ నెల 15వ తేదీ ఆదివారం ఓల్డ్ చెక్‌పోస్టు నుంచి ఉదయం ఆరు గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఓటరు అవగాహన కోసం ఈ పరుగు పందెం నిర్వహిస్తున్నట్టు, ఇందులో మొదటి బహుమతి రూ.ఐదు వేలు, రెండవ బహుమతి రూ.మూడు వేలు, మూడవ బహుమతి రూ.రెండు వేల చొప్పున విజేతలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆరోగ్య రక్షణలో భాగంగా సామాజిక కార్యక్రమం ఓటు అవగాహన కోసం రన్ కార్యక్రమాలు చేపట్టామని, ప్రతి ఒక యువతి, యువకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో క్విట్ ఇండియా పౌండేషన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణాకర్, సురేష్, ధన్‌రాజ్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ భూపెల్లి తిరుపతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కాగజ్‌నగర్ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ చీపురుశెట్టి శంకరయ్య అధ్యక్షతన బుధవారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్టు ఇన్‌ఛార్జి ఎంపీడీఓ గౌరీ శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఆయా శాఖల అధికారులు తమ నివేధికలతో విధిగా హాజరు కావాలని సూచించారు.

లింగయ్యపల్లెలో 2వ విడత గొర్రెల పంపిణీ

నవతెలంగాణ-జన్నారం



మండలం లింగయ్యపల్లె గ్రామంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం అందించే 2వ విడత గొర్రెల పంపిణీ క్యాక్రమాన్ని మండల పశు వైద్యాధికారి డా. శ్రీకాంత్, సొసైటీ ప్రెసిడెంట్ నరేష్ యాదవ్, గ్రామ సర్పంచ్ బోర్లకుంట లావణ్య రాజలింగు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న ఈ గొర్రెలను, యాదవులు తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. త్వరలో మిగతా లబ్ధిదారులకు 2వ విడత గొర్రెల పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గొర్రెల మేకల పెంపకదారులు యాదవులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

నవతెలంగాణ-జన్నారం



మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎండీ రియాజుద్దీన్ అన్నారు. మంగళవారం జన్నారం గ్రామ శివారులో ఉన్న చెరువులో ఆ గ్రామ నాయకులు, మత్స్యకారుల సంఘం నాయకులతో కలిసి చేప పిల్లలను వదిలారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సొసైటీ సంఘం, అధ్యక్షులు గుర్రపు రమేష్ కార్యదర్శి ముత్యాల నర్సయ్య కుల సంఘం నాయకులు పుట్టాకొక్కుల లచ్చన్న రాజేందర్ రమేష్ పి.వెంకటేష్, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఐదు సంవత్సరాల జైలు

నవతెలంగాణ-తాండూర్

నెన్నెల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొప్పారం గ్రామానికి చెందిన బద్దం లక్ష్మారెడ్డికి హత్యాయత్నం కేసులో న్యాయస్థానం ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్టు ఎస్సై శ్యాం పటేల్ తెలిపారు. వివరాల ప్రకారం.. లక్ష్మణరెడ్డి సొంత అన్న అయినా బద్దం బాపురెడ్డి భూ పంపకాల విషయంలో కొంతకాలం నుంచి గొడవలు జరుగుతున్నతరుణంలో, నెన్నెల తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితుడు బద్దం లక్ష్మారెడ్డి విరాసత్ గురించి వెళ్లి కార్యాలయం నుంచి బయటకు వస్తుండగా నేరస్థుడు బద్దం బాపురెడ్డి తన తమ్ముడు లక్ష్మారెడ్డిని చంపాలనే ఉద్దేశంతో కళ్ళలో కారంపొడి చల్లి తాను తెచ్చుకున్న కత్తితో పొడిచి హత్య యత్నం చేయగా అప్పటి ఎస్సై శ్రీ చందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నేరస్తులపై చార్జీషీట్ ఫైల్ దాకలు చేశారు. కోర్టులో ప్రాసిక్యూషన్ తరపున మదన్మోహన్ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించగా, లక్ష్మణ్ పిసి సాక్షులను ప్రవేశపెట్టగా కేసు విచారించిన అసిస్టెంట్ సెషన్స్ కోర్టు మంచిర్యాల, న్యాయస్థానంలో నేరం రుజువు కావడంతో మంగవారం నేరస్తునికి ఐదు సంవత్సరాల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గృహహింస కేసులో ఒకరికి జైలు శిక్ష

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణానికి చెందిన దొంత మసీంద్రకు గృహింస కేసులో న్యాయస్థానం ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష విదించినట్లు బెల్లంపల్లి వన్ టౌన్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ బన్సిలాల్ తెలిపారు. 2015 సంవత్సరంలో తన భర్త శారీరకంగా మానసికంగా వేధిస్తున్నాడని, అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడని బాధితురాలు పిర్యాదు చేయటంతో అప్పటి ఏఎస్సై జి.రమేష్ కేసు నమోదు చేశారు. నేరం ఋజువు కావడంతో జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎస్ ముకేష్ నేరస్తునికి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్



నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సోమగూడెం గ్రామంలో అచ్చె అర్జయ్య ఇంట్లో జరిగిన చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం మందమర్రి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. ఇటీవల 30వ తేది అర్జయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాళం పగలగొట్టి బెల్లంపల్లి టేకులబస్తీకి చెందిన ఏదుల దీపక్, కన్నాలకు చెందిన మ్యాకల అశోక్, తాండూర్ అంకుశంకు చెందిన ముద్దం సాయి కిరణ్‌లు బంగారం, వెండి దొంగతనం చేశారు. దొంగతనం చేసిన వారిని చాకచక్యంగా గుర్తించి అరెస్ట్ చేసి బంగారం, వెండి నగలను స్వాధీనం చేసుకున్నారు. నింధితులు జల్సాలకు అలువాటు పడి దొంగతనం చేసినట్లు వివరించారు. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి పర్యవేక్షణలో నేరం జరిగిన రెండు రోజుల్లోనే కేసును చేధించి నింధితులను పట్టుకోవడంలో శ్రమించిన కాసిపేట ఎస్సై గంగారాం, హెడ్ కానిస్టేబుల్ అజయ్, కానిస్టేబుళ్ళు మల్లికార్జున్, కిరణ్ కుమార్, శ్రీనివాస్, సంపత్‌ల అధికారులు అభినందించారు.

మధ్యాహ్న భోజన కార్మికుల భిక్షాటన



నవతెలంగాణ-జన్నారం

మండలం కేంద్రంలో మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులు భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. వారం రోజులుగా తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిరవధిక దీక్ష చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని సీఐటీయూ మండల అధ్యక్షుడు బుచ్చయ్య అన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు జువాడి వసంత, సేపూరి లక్ష్మి పాల్గొన్నారు.

బీజేపీ విధానాలతో సామాజిక న్యాయం సమాధి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దూర్కే మోహన్
- కుల వివక్ష పోరాట సమితి 25వ ఆవిర్భావ వేడుకలు

నవతెలంగాణ-వేమనపల్లి



బీజేపీ విధానాలతో భారత రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేయడానికి మనుస్మృతి ప్రవేశపెట్టి సామాజిక న్యాయాన్ని పూర్తిగా సమాది చేసేందుకు కుట్రలు జరుగుతన్నాయని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి(కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి దూర్కే మోహన్ అన్నారు. మంగళవారం కేవీపీఎస్ 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని కొత్త జాజులపేటలో ఘనంగా నిర్వహించారు. జెండా ఎగురవేసిన అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్ల అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మగౌరవం సమానత్వం కుల నిర్మూలన అనే లక్ష్యాల సాధన కోసం 1998 అక్టోబర్ 02న కేవీపీఎస్ ఓ చారిత్రక అవసరంగా ఏర్పడిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కుల వివక్ష అంటరానితనంపై వేలాది గ్రామాల్లో సర్వేలు నిర్వహించి దశల వారి పోరాటాలు నిర్మించి ఎస్సీ ఎస్టీ కమిషన్‌ను సాధించిందన్నారు. దళిత గిరిజనులు 30 శాతం వరకు ఉండగా కేవలం 4శాతం మాత్రమే నిధులు కేటాయిస్తున్న తరుణంలో 2004 నుంచి 2013 వరకు దశల వారి పోరాటాలు నిర్మించి జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో దళిత గిరిజనులు నిధులు సమకూర్చే విధంగా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని సాధించించామన్నారు. దళితుల శవాలను పూడ్చుకోవటానికి స్థలం లేనపుడు శవపేటికలతో దశల వారి ఉద్యమం చేసి ప్రతి దళిత వాడకు రెండెకరాల ప్రభుత్వ భూమి స్మశాన స్థలం కోసం కేటాయించే విధంగా జీఓ నెంబర్ 1235ను సాధించిందన్నారు. దళితుల కు 101 యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇవ్వాలని జీఓ నెంబర్ 342ను కేవీపీఎస్ పోరాడి సాధించిందని గుర్తు చేశారు. కులాంతర వివాహాల ప్రోత్సాహానికి జీఓ నెంబర్ 12 ప్రకారం రూ.2,50 లక్షలు చెల్లించే విధంగా కేవీపీఎస్ పోరాడిందన్నారు. రాష్ట్రంలో జరిగిన కుల దురహంకార హత్యలకు వ్యతిరేకంగా కేవీపీఎస్ సమరశీల పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల నాయకులు కామెర సంజీవ్, దూర్కే ప్రవీణ్, దూర్కే తిరుపతి, దుర్గం రోశయ్య పాల్గొన్నారు.

కోల్ ఇండియాలో వేతనాలు ఆపినందుకు నిరసన



మందమర్రిలో..

నవతెలంగాణ-మందమర్రి

కోల్ ఇండియాలో వేతనాలు ఆపినందుకు సీఐటీయూ నాయకులు మంగళవారం నిరసన తెలిపారు. మందమర్రి ఏరియాలోని వర్క్ షాపులో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వడ్లకొండ ఐలయ్య అధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. డీపీఈ నిబంధనలను సడలించి వేతన ఒప్పందాన్ని యధావిధిగా కొనసాగించాలని కోరుతూ వర్క్ షాప్ డిజీయం నాగరాజు నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఐలయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డీపీఈ అనుమతుల విషయం పట్టించుకోకుండా తమాషా చూస్తున్న తీరును కార్మికులు గమనించాలని అన్నారు. కార్మికుల ఓట్లతో గెలిచిన ఎంపీలు చట్టసభల్లో మాట్లాడకుండా 2.5లక్షలకు పైగా బొగ్గు గని కార్మికుల వేతనాల విషయంలో ప్రతిష్టంభన ఏర్పడుతున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కొందరు సింగరేణిలోని నాయకులు కోలిండియాలో వేతనాలు ఆపిన దానికి సింగరేణికి సంబంధం లేదని చెబుతుండడం సరికాదని, వేతన ఒప్పందం ఎక్కడైనా ఒకటేనని, డీపీఈ అనుమతులు రాకపోతే 11వ వేతన ఒప్పందం ప్రమాదంలో పడే అవకాశం ఉన్నదని కార్మికులు గమనించాలని కోరారు. కోల్ ఇండియాలో చేసుకున్న ఒప్పందం ప్రకారమే వేతనాలు అలవెన్స్‌లు సింగరేణిలోనూ అమలవుతున్నాయని, కొందరు అధికారులు కార్మికుల బేసిక్లు పెరిగాయని కోర్టుకు వెళ్లడం వల్లనే ఈ సమస్య జఠిలంగా మారిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ సెక్రటరీ భేతి భరత్, బ్రాంచ్ సెక్రటరీ అల్లి రాజేందర్ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్ : సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో మంగళవారం కేకే గనిపై నల్ల బ్యాడ్జీలతో కార్మికులు నిరసన తెలియజేసి ఆ గని మేనేజర్ భూశంకరయ్యకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సిఐటీయు బ్రాంచ్ అధ్యక్షులు వెంకటస్వామి మాట్లాడుతూ ఈ నెల 5, 6, 7 తేదిల్లో మూడు రోజుల దేశవ్యాప్త సమ్మె ఐదు జాతీయ సంఘాలు కోల్ ఇండియా లెవెల్‌లో పిలుపునిచ్చిన సమ్మెను కోల్ ఇండియా చైర్మన్ చెప్పిన మాట మేరకు కేంద్రంతో మాట్లాడి డిపిఈకి సడలింపులకు ప్రయత్నం చేస్తానని చెప్పిన మాటకు కట్టుబడి ప్రకటించిన మూడు రోజుల సమ్మెను వాయిదా వేసుకోవడం జరిగినదని అన్నారు. ఈ కార్యక్రమంలో పిట్ కార్యదర్శి సంకే వెంకటేష్, ఆర్గనైజర్ వడ్లకొండ శివ, చైతన్య రెడ్డి, కలవల శ్రీనివాస్, దొండ నవీన్, ఆదర్ష్, తిరుపతి నాయక్, పాల్గొన్నారు



రామకృష్ణాపూర్‌లో..

మధ్యంతర భృతి 20 శాతం ఇవ్వాలి

నవతెలంగాణ-భీమారం



పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వం ప్రకటించిన 5 శాతం మధ్యంతర భృతి ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదని, 20 శాతం ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షులు సయింపు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల తరువాతనైనా రాష్ట్ర ప్రభుత్వం శివ శంకర్ రిటైర్డ్ ఐఏఎస్ చైర్మన్‌గా పే రివిజన్ కమిటీని నియమించడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. కానీ గత పీఆర్సీలో ఐఆర్ లేకుండా 30 నెలల వేతనాన్ని ఉద్యోగస్తులు కోల్పోయారన్నారు. పీఆర్సీ ఫిట్మెంట్ ఇవ్వాలంటే కనీసం 20 శాతం మధ్యంతర భతిని ప్రకటించి తమ న్యాయమైన కోరికలను నెరవేర్చాలని కోరారు. జూలై 2022 నుంచి రావలసిన రెండు డీఏలను ముందుగా మంజూరు చేసి, గత పీఆర్సీ బకాయిల 15 నెలల మొత్తం ఒకే దఫాలో చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్, టీఎస్‌జీఎల్ఐసీ రుణాల బిల్లులు, మెడికల్ బిల్లులు, సంపాదిత సెలవుల బిల్లులను వెంటనే విడుదల చేయాలని అన్నారు. ఎస్‌జీటీ, పండితులు, పీఈటీలకు పదోన్నతులతో కూడిన బదిలీలనే చేపట్టాలని, లేకుంటే తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మంచిర్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టడానికి త్వరలోనే కార్యచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తపస్ భీమారం మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సంతోష్ కుమార్, బీమనాథం మహేష్ పాల్గొన్నారు.

గిరిజన మహిళ దారుణ హత్య

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన మహిళను హత్య చేసిన సంఘటన మండలంలో మంగళవారం కలకలం రేపింది.. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం... గంగాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని తుకారాంనగర్‌కు చెందిన మెస్రం దేవుబాయి(45) హత్యకు గురైంది. మృతురాలు తుకారాంనగర్‌కు చెందిన మెస్రం మోతీరాం భార్య. గ్రామ సమీపంలో తనకున్న పత్తి చేనులో సోమవారం సాయంత్రం వరకు పనులు చేసుకుంటూ ఉంది. దేవుబాయి రాత్రి వరకు ఇంటికి రాక పోవడంతో మృతురాలి భర్త మోతీరాం చేనుతో పాటు చుట్టుపక్కల గాలించాడు. ఆచూకి తెలియక పోవడంతో ఏటైనా వెళ్లి ఉండవచ్చని భావించి, తిరిగి ఇంటికి వచ్చాడు. మంగళవారం ఉదయం చేనుకు వెళ్లిన మోతీరాం అక్కడ రక్తపు మరకలు కనిపించడంతో వెంటనే కంగారు పడి గ్రామస్తులకు సమాచారం అందించాడు. మోతీరాంతో పాటు గ్రామస్తులు వచ్చి చేనులో గాలించగా చేనులో ఒక్క మూలన చెత్త కుప్పల కింద మృతదేహం కనిపించింది. తీవ్ర రక్తపు మడుగులో ఉన్న విషయం పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే సీఐ రామకృష్ణ, ఎస్సై మనోహర్ ఇద్దరు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను, గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉట్నూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలని మంత్రాల నేపంతోనైనా, ఇతర కారణాలతోనైనా హత్య చేశారా అని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి యువకుడి మృతి

నవతెలంగాణ-తలమడుగు

చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కప్పర్‌దేవి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కప్పర్‌దేవి గ్రామానికి చెందిన కొరెంగ వెంకటేష్(32) సోమవారం రాత్రి చేపలు పట్టేందుకు గ్రామ సమీపంలోని వాగులోకి విద్యుత్‌తో చేపలు పట్టేందుకు ప్రయత్నించగా విద్యుద్ఘాతంతో అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని అదే రోజు రాత్రి రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ సీఐ సైదారావు తెలిపారు. మృతుడికి భార్య కుమారుడు ఉన్నారు.

గుండెపోటుతో డీఆర్వో మృతి



ఉట్నూర్ : త్వరగా విధులకు వెళ్లాలని లేచి స్నానానికి వెళ్లి గుండెపోటుతో డీఆర్వో జాడి రాజేశ్వర(62) మంగళవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జాడి రాజేశ్వర్ ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ ఆర్డీఓ, జిల్లా ఇన్‌చార్జి డీఆర్వోగా విధులు నిర్వహిస్తున్నారు. వారానికి కొకసారి ఇంటికి వచ్చి వెళుతుండేవాడు. ఈ క్రమంలో ఇంటికి వచ్చి యధావిధిగా విధులకు వెళ్లేందుకు మంగళవారం ఉదయం లేచి స్నానం చేసేందుకు బాత్ రూమ్‌కి వెళ్లారు. పిలిచిన పలకలేదు. మృతుడు తమ్ముడు మల్లేష్ వచ్చి పిలిచిన బాత్ రూమ్ డోర్ తీయలేదు. వెంటనే డోర్ పగలగొట్టి వెళ్లేసరికి కింద పడి ఉన్నాడు. వెంటనే కారులో ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందారు. మృతుడికి భార్య పిల్లలున్నారు.

ప్రముఖుల సంతాపం...

ఆసిఫాబాద్ డీఆర్వో జాడి రాజేశ్వర్ గుండెపోటుతో మృతి చెందడంతో ఉమ్మడి జిల్లాలోని ప్రముఖులు వచ్చి మృతదేహం వద్ద సంతాపం ప్రకటించి, నివాళులర్పించారు. ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హేమంత్, ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్, ఉమ్మడి జిల్లాలోని జిల్లాస్థాయి అధికారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, బంధువులు వచ్చి నివాళులర్పించారు. మృతికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

అదుపుతప్పి ఆటో బోల్తా ఇద్దరికి స్వల్ప గాయాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆటో అదుపుతప్పి బోల్తా పడ్డ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం ఆదిలాబాద్ మండలంలోని పొచ్చెర గ్రామంలో మంగళవారం ఆటో బ్రిడ్జిపై నుంచి పొచ్చెర వాగులో బోల్తా పడింది. ఆటో నెంబర్ 9438 స్కూల్ పిల్లలను రాంపూర్ సాక్రెడ్ హార్ట్ స్కూల్ నుంచి కప్పర్లకు పోతున్న సమయంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఆటోలో 12 మంది పిల్లలు ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డవారిని రిమ్స్‌కు తరలించారు. ఆటోడ్రైవర్ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు

మంచిర్యాల: జాతీయ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా మండలంలోని క్వారీలో గల దుర్గామాత ఆలయం ముందు మంగళవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ గేయ రచయిత అక్కల చంద్రమౌళి, దర్శకుడు పన్యాల రాజ్ కుమార్, ఆల్ ఇండియా రైడర్, ఎనిమల్ ఆక్టివిటీస్ట్ కొండ సిద్దార్థలు పాల్గొన్నారు. క్వారీ అటవిలో ప్లాస్టిక్, ఇతర చెత్తను క్లీన్ చేశారు. బుధవారం వారోత్సవాల సందర్భంగా పిల్లలకు వని దర్శిని కార్యక్రమం చేస్తున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ స్వామి తెలిపారు.

అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

బోథ్ : నియోజకవర్గంలోని అన్ని వర్గాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అనిల్ జాదవ్, ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని కనుగుట్ట గ్రామంలో రూ.8లక్షల నిధులతో నిర్మించిన బీసీ సంఘం ప్రహరీ గోడను ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కుల సంఘాలకు కమ్యూనిటీ భవనాలు నిర్మించి, అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి బోజారెడ్డి, కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచ్ శ్యామల రమేష్, జెడ్పీటీసీ సంధ్యారాణి ప్రసాద్, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రితం రెడ్డి, మున్నూర్ కాపు సంఘం అధ్యక్షుడు రాజు, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, నాయకులు ముత్యంరెడ్డి, ఆత్మ చైర్మెన్ మల్లెపూల సుభాష్, ఉపసర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ రమణ, నాయకులు రోహిదాస్, రమణగౌడ్, ఈశ్వర్ ముండే, ప్రశాంత్, డా.స్వామి, సుధీర్‌రెడ్డి, వినయ్, బుచ్చన్న, రవీందర్ పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి

ఉట్నూర్: దివ్యాంగుల సమస్యల సాధనకు తన వంతుగా కృషి చేస్తానని మండల దివ్యాంగుల ఐక్యవేదిక మండల అధ్యక్షుడు సలాఉద్దీన్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో మండల నూతన కమిటీని ఎన్నుకొన్నారు. మండల అధ్యక్షుడు సలాఉద్దీన్, ఉపాధ్యక్షులుగా జాకబ్, కోశాధికారులుగా సంచల రమేష్, సాబీర్, సభ్యులుగా గోకుల్, సుదర్శన్, బాబా, ప్రశాంత్, లక్ష్మణ్, అలీ, ప్రవళిక, సుభాష్, రామారావు లను ఎన్నుకొన్నారు. అనంతరం సలాఉద్దీన్ మాట్లాడుతూ తనకి ఈ పదవిని ఇచ్చినందుకు చాలా ధన్యావాదాలు తెలిపారు. అందరి సమిష్టితో పని చేసి ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్క దివ్యాంగులకు చేకూరేలా నా వంతు కృషి చేస్తానన్నారు.

గ్రామీణ క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గ్రామీణ ప్రాంతాల్లో క్రీడ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం అన్ని విదాల కృషి చేస్తోందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్ జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, జిల్లా యువజన క్రీడాలభివద్ధి అధికారి రమాదేవితో కలిసి క్రికెట్, వాలీబాల్, టీ షర్టులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో యువతకు చదువుతో పాటు శారీరక దాడుర్యానికి, ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతగానో దోహదం చేస్తాయని అన్నారు. ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు ఈ క్రీడా సామాగ్రిని సద్వినియోగం చేసుకునేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన, కెరమెరి జడ్పీటీసీలు సౌందర్య, ద్రుపతబాయి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థ అధ్యక్షుడు అలీబిన్ అహ్మద్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయితీ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.



సిర్పూర్(టి) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యువత క్రీడా రంగంలో రాణించాలనే ఉద్దేశ్యంతో ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటుచేసి క్రీడా సామగ్రిని అందిస్తున్నట్టు, ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ చునార్కర్ సువర్ణ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. 16 గ్రామ పంచాయతీలకు సంబంధించిన సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు క్రీడా సామాగ్రిని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాలతో సమానంగా విద్యార్థులకు, యువతకు ప్రాధాన్యతను ఇచ్చిందని, యువతి, యువకులు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్, ఎంపీటీసీ సోహెల్ హైమద్, మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్, సిర్పూర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ తోట మహేష్, నాయకులు పాల్గొన్నారు.

కౌటాల : యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు క్రీడా సామగ్రిని అందజేశారు. ప్రతి సర్పంచ్, యువత చెడుదారి పట్టకుండా క్రీడలపై మళ్లించి మండల, జిల్లా, రాష్ట్రస్థాయికి ఎదిగేలా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఒజ్జెల మౌనీష్, శ్రీనివాస్, దామోధర్, సోమయ్య, ఎంపీడీఓ నస్రుల్లాఖాన్, కార్యదర్శి సాయికృష్ణ, తిరుపతి పాల్గొన్నారు.

వాంకిడి : మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలకు మంజూరైన క్రీడా సామగ్రిని ఎంపీపీ ముండె విమలాబాయి, జడ్పీటీసీ అజయ్‌కుమార్ సర్పంచ్‌లకు పంపిణీ చేశారు. క్రికేట్ కిట్టు, వాలీబాల్ కిట్టు, డంబుల్స్ మొత్తం 28 గ్రామ పంచాయతీలకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ శివకుమార్, మండలంలోని సర్పంచ్‌లు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.కోటి వ్యయంతో ఫంక్షన్ హాల్

ఆదిలాబాద్‌టౌన్ : ఆదిలాబాద్ పట్టణంలోని అశోక బుద్ధ విహార్‌లో రూ.కోటి వ్యయంతో నిర్మించనున్న ఫంక్షన్ హాల్ భూమిపూజ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ట్రస్ట్ కార్యాలయంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ నాయకులతో కలిసి పాల్గొన్న ఆయన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో కోటి రూపాయల నిధుల వ్యయంతో ఫంక్షన్ హాల్ ను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ నెల 6న శుక్రవారం ఉదయం 10 గంటలకు బౌద్ధ వందనం, 11 గంటలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా భూమిపూజ ఉంటుందన్నారు. వేడుకలకు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు భీంరావ్ వాగ్మారే, జనరల్ సెక్రెటరీ దాదా సాహెబ్ జబడే, ఉపాధ్యక్షులు ఉద్ధవ్ సూర్యవంశీ, కోశాధికారి అంబాజీ పవర్, జాయింట్ సెక్రెటరీ ఆకాష్ దీప్ కాంబ్లె ఉన్నారు.



మా ఓట్లన్నీ అనిల్ జాదవ్‌కే

- మదనాపూర్ గ్రామ గిరిజనుల తీర్మానం

నవతెలంగాణ-తలమడుగు

భరంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గిరిజన మదనాపూర్ గ్రామస్తులు రాబోవు ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌కే ఓట్లు వేస్తామంటూ మంగళవారం తీర్మానించారు. అనిల్ జాదవ్ గెలిస్తేనే గ్రామ సమస్యలు తీరుస్తాడని గిరిజనులు తెలిపారు. అనిల్ గెలుపు కోసం శాయశక్తుల కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు మెస్రం భీంరావు, దేవ్‌రావు, భూమన్న, గోదారావు, అవినాష్, తురుపాబాయి, మెస్రం సావిత్రిబాయి, బాగుబాయి, గేడం సీతాబాయి పాల్గొన్నారు.



రైతుల శ్రేయస్సు కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కుమ్ర విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ పాల్గొన్నారు. రైతుల శ్రేయస్సు కోసం పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. అలాగే ప్రస్తుతం ఖరీఫ్ మార్కెటింగ్ పత్తి సీజన్ ప్రారంభం కాబోతున్న తరుణంలో మార్కెట్ యార్డులో రైతులకు అవసరమయ్యే పలు మౌలిక సదుపాయాలను కల్పించి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లపై కమిటీ సభ్యులు చర్చించారు. రాబోయే సీజన్‌లో సీసీఐ ద్వారా విక్రయాలకు ప్రతి రైతు ఆధార్ ప్రామాణికం చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేష్, పాలకవర్గ సభ్యులు, మార్కెటింగ్ శాఖ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందిస్తాం : డీఎంఅండ్‌హెచ్‌ఓ



నవతెలంగాణ-నార్నూర్

ఏజెన్సీలో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందిస్తామని డిఎంహెచ్ఓ రాథోడ్ నరేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో సంకల్ప సప్తహ కార్యక్రమంలో భాగంగా వైద్య మేళా నిర్వహించారు. గర్భిణులకు, వివిధ రోగులకు వైద్యం అందించారు. 15 వరకు వైద్య మేళా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతుందని డీఎంఅండ్‌హెచ్ఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ ఎంపిపి చంద్రశేఖర్, సర్పంచ్ ఆడే గజానంద్ నాయక్, పిఎసిఎస్ ఇన్‌చార్జి చైర్మన్ సురేష్ ఆడే, ఎంపిడిఓ కావల రమేష్, కో ఆప్షన్ మెంబర్ దస్తగిరి, ఉప సర్పంచ్ మహేందర్, వైద్యులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిపాలన వికేంద్రీకరణకు కొత్త పంచాయతీల తోడ్పాటు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పరిపాలన వికేంద్రీకరణకు, త్వరితగతిన సమస్యల పరిష్కారానికి నూతన పంచాయతీలు తోడ్పడుతున్నాయని జెడ్పిటిసి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని మాలనుగొంది గ్రామపంచాయతీ పరిధిలో నూతనంగా నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన గ్రామ పంచాయతీల నిర్మాణాల వల్ల ప్రజలకు పరిపాలన అందుబాటులోకి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పరిపాలన వికేంద్రీకరణ కోసం అనేక చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబీన్ అహ్మద్, ఎంపీటీసీ లింగు, సర్పంచ్ మడావి సీత, ఎంపీఓ ప్రసాద్, నాయకులు తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేతాజీ సేవా రత్న పురస్కార్‌కు ఎంపిక



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నేతాజీ వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో చేపట్టిన నేతాజీ సేవా రత్న పురస్కార్‌కు న్యాయవాది రాజలింగు మోతె ఎంపికయ్యారు. సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాను చేపడుతున్న వివిధ సామాజిక కార్యక్రమాలకు ఈ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పట్టణానికి చెందిన వివిధ పార్టీ, ప్రజా సంఘాల నాయకులు అభినందించారు. అనంతరం రాజలింగు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందని, నేతాజీ వరల్డ్ రికార్డ్స్ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువ సబర్మతి ఆర్గనైజేషన్ అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్, ఆల్ ఇండియా దళిత్ రైట్స్ ఫెడరేషన్ చెన్నూర్ నియోజకవర్గ అధ్యక్షులు తుంగ వెంకటేష్, బీఆర్ఎస్ యువ నాయకులు కలవల సతీష్ కుమార్, తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి వేల్పుల వెంకటస్వామి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ హాస్టల్ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని బీసీ బాలుర వసతిగృహంలో మంగళవారం ఎస్ఎఫ్ఐ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా అంజన్న, కృష్ణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హాస్టల్‌ను సందర్శించిన జిల్లా అధ్యక్షులు షేక్ జాఫర్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థికి విద్య అందాలనే ధ్యేయంతో ఎస్ఎఫ్ఐ పోరాటాలు చేస్తోందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండోసారి అధికారంలోకి వచ్చాక విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టు పట్టించాయని అన్నారు. రానున్న రోజులలో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు సాయికుమార్, సహాయ కార్యదర్శి దిగిడె ప్రకాష్, సభ్యులు మోహర్లె రాంచందర్ పాల్గొన్నారు.



ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలి

నవతెలంగాణ-నిర్మల్

ఆశా వర్కర్లకు ఫిక్స్డ్ వేతనం ఇవ్వాలని, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ అన్నారు. సమ్మెలో భాగంగా మంగళవారం ఆర్డిఓ కార్యాలయం నుండి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నివాసం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. రూ.18వేల వేతనం ఇవ్వాలన్నారు. ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి రామలక్ష్మి, నాయకులు సుజాత, దిలావర్‌పూర్ అధ్యక్షులు పద్మ, సారంగపూర్ అధ్యక్షులు శ్యామల, లక్షణచాంద అధ్యక్షులు విజయ, నిర్మల్ రూరల్ అధ్యక్షులు స్రవంతి, భాగ్య పాల్గొన్నారు.



నిర్మల్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసు ముట్టడి

కాగజ్‌నగర్ : ఆశా కార్యకర్తలు మంగళవారం కాగజ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు చేపడుతున్న సమ్మె మంగళవారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా ముందుగా స్థానిక బాలభారతి పాఠశాల నుండి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ. 18 వేలు చెల్లించాలని, ఈఎస్ఐ, ప్రమాదబీమా కల్పించాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు జమీల, పద్మ, పంచశీల, గౌరుబాయి, శోభ, లక్ష్మి, కవిత, అనురాధ, నాగమణి పాల్గొన్నారు.



కాగజ్‌నగర్‌లో ర్యాలీగా వెళ్తున్న ఆశా కార్యకర్తలు

బీఆర్ఎస్ పని చేసే ప్రభుత్వం : ఎమ్మెల్యే కోనప్ప

నవతెలంగాణ - బెజ్జూర్

ప్రజల కోసం పనిచేసేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మర్తిడి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో 47 వంతెనలు నిర్మించినట్టు తెలిపారు. రైతుల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నామన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. మాయమాటలు చెప్పే నాయకులను నమ్మొద్దన్నారు. మర్తిడి గ్రామంలో జంగు భూముల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. అనంతరం మండలంలోని కుంటలమానెపెల్లి, రుద్రాపూర్ రోడ్డు నిర్మాణానికి రూ.2.68 కోట్లు, ఆర్‌అండ్‌బీ రోడ్ డబ్బా కూడా రోడ్డు నిర్మాణానికి రూ.97లక్షలు, మర్తిడి నుండి సలుగుపెల్లి రోడ్డు నిర్మాణానికి రూ.మూడు కోట్లు, రంగాపూర్ రోడ్డు నిర్మాణానికి రూ.62 లక్షలు, బెజ్జూర్ నుండి సిద్దాపూర్ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు, సలుగుపెల్లి టు గంగరాంగూడ రోడ్డు నిర్మాణానికి రూ.2.39 కోట్లు అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు.



బీఆర్ఎస్‌లో భారీగా చేరికలు

మండలంలోని నాగవెల్లి, తుమ్మలగూడ, బెజ్జూర్, ఎలుకపెల్లి గ్రామాల నుండి బీఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సమక్షంలో భారీగా చేరారు. బీఆర్ఎస్‌లో చేరిన వారికి పార్టీ కండువా కప్పి సాధారంగా ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి పనిచేయాలని కోరారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు బీఆర్ఎస్‌లోకి..

కాంగ్రెస్ అధ్యక్షుడు దేవనపల్లి సత్తయ్య బీఆర్ఎస్‌లో చేరారు. రజక సంఘం నాయకులు సైతం బీఆర్ఎస్‌లో చేరగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు కోండ్ర జగ్గాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ ఓంప్రకాష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సకారాం, కోఆప్షన్ సభ్యుడు బశరత్‌ఖాన్, సర్పంచ్ రవికుమార్, ఎంపీటీసీలు గురిజాల వెంకన్న, పర్వీన్ సుల్తానా, మండల నాయకులు డోకే వెంకన్న, నరేందర్‌గౌడ్, రామకృష్ణ, జావిద్ అలీ పాల్గొన్నారు.

720 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం

- లక్ష్యాలను అధిగమిస్తే ఈ ఏడాది రూ.40వేల కోట్ల టర్నోవర్, రూ.3,500 కోట్లు లాభం
- తొలి అర్ధ సంవత్సరంలో 12శాతం ఉత్పత్తి, 7శాతం ఓబీ తొలగింపు, 15 శాతం వృద్ధి
- ఇక నుండి రోజుకు 2.1లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణ సాధించాలి
- సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్

నవతెలంగాణ-జైపూర్

వచ్చే మార్చి నాటికి 720 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంతో ముందుకు సాగాలని సింగరేణి సీఎండీ ఎన్ శ్రీధర్ సూచించారు. హైదరాబాద్ సింగరేణి భవన్ నుండి సంస్థ డైరెక్టర్లతో పాటు అన్ని ఏరియా జనరల్ మేనేజర్లతో మంగళవారం సమీక్షించారు. దేశవ్యాప్తంగా బొగ్గుకు తీవ్రమైన డిమాండ్ ఏర్పడుతున్నందున ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంకా మిగిలి ఉన్న ఆరు నెలల్లో రోజుకు 2.10 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి, రవాణా జరుపాలని, ఫలితంగా 720 లక్షల టన్నుల వార్షిక లక్ష్యాన్ని దాటాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు అన్ని ఏరియాలకు అవసరమైన యంత్రాలు, అనుమతులు, ఓబీ కాంట్రాక్టులు ఇప్పటికే ఇవ్వడం జరిగిందన్నారు. ఇక నుండి వర్షాలు కురిసే అవకాశం తక్కువ కాబట్టి రానున్న వారంలో రోజుల్లోగా ఓపెన్ కాస్ట్ క్వారీలలో ఇంకా నిలిచిన ఉన్న నీటిని బయటకు తోడి బొగ్గు ఉత్పత్తిని ఓవర్ బర్డెన్ తొలగింపును ఇచ్చి లక్ష్యాల మేరకు విధిగా సాధించాలని పేర్కొన్నారు. దీని కోసం ఏరియా స్థాయిలో సమిక్ష సమావేశాలు నిర్వహిస్తూ ముందుకు పోవాలని జీఎంలను ఆదేశించారు. అన్ని ఏరియాలు తమకు ఇచ్చిన లక్ష్యాలను సాధిస్తే ఈ ఏడాది నిర్దేషిత 720 లక్షల టన్నుల వరకు బొగ్గు ఉత్పత్తి రవాణా చేసే అవకాశం ఉందన్నారు. తద్వార రూ. 40 వేల కోట్ల టర్నోవర్ వరకు బొగ్గు ఉత్పత్తితో సుమారుగా రూ. 3,500 కోట్ల రూపాయల లాభాలు సాధించే అవకాశం ఉందన్నారు. సింగరేణి ఉద్యోగులకు గతంలో ఎన్నడు లేని విధంగా ఒకే దఫా రూ. 1,750 కోట్ల వేజ్ బోర్డు ఏరియర్స్ చెల్లించామని, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా 32 శాతం లాభాల బోనస్ మొత్తం రూ. 711 కోట్లు దసరా పండుగకు ముందే విడుదల చేయనున్నామని ప్రకటించారు. ఆ తర్వాత దీపావళి బోనస్ కూడా పండుగకు ముందే కార్మికుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందని తెలిపారు.



తొలి అర్థ సంవత్సరంలో లక్ష్యాలను దాటిన సింగరేణి

ఈ ఆర్థిక సంవత్సరంలో ఎప్రిల్ నెల నుండి సెప్టెంబర్ మాసాంతానికి గల అర్థ సంవత్సరంలో సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తి బొగ్గు రవాణాలో నిర్దేషిత లక్ష్యాలను సాధించింది. ఈ అర్థ సంవత్సరంలో బొగ్గు రవాణ లక్ష్యం 307 లక్షల టన్నులు కాగా సింగరేణి లక్ష్యాన్ని దాటి 330 లక్షల టన్నుల బొగ్గు రవాణా జరిపి 7 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఈ ఏడాది తొలి అర్థ సంత్సరంలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 314 లక్షల టన్నులు సాధించి 100 శాతం లక్ష్య సాధనతో నిలిచినట్లు తెలిపారు. అదేవిధంగా తొలి అర్థ సంవత్సరంలో 13.84 శాతం వృద్ధితో 196.72 మిలియన్ క్యూబిక్ మీటర్ల ఓవర్ బర్డెన్ తొలగించినట్లు సంస్థ సాధించినట్లు తెలిపారు.

ఎండీఎం కార్మికుల ర్యాలీ



భీమారం : సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మెలో భాగంగా మంగళవారం ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో చెల్లించాల్సిన బిల్లులు పెండింగులో ఉండటంతో మధ్యాహ్న భోజన నిర్వహణ ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. పెరిగిన వేతనం ఇంతవరకు చెల్లించకపోవడంతో పాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులను సైతం ఇప్పటివరకు విడుదల చేయలేదన్నారు. దీంతో తాము తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తాజాగా ప్రభుత్వం కొత్తగా మెనూ ప్రకటించింది కానీ కార్మికుల సమస్యలను పరిగణలోకి తీసుకోకపోవడం ఆవేదనకు గురిచేస్తోందని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో రంగు సరిత, అనసూయ, కొమ్ము గురువమ్మ, జయ, శారద, భీమారం, జైపూర్ మండలాల కార్మికులు పాల్గొన్నారు.

23వ రోజుకు అంగన్వాడీల సమ్మె



మద్దతు తెలుపుతున్న వైఎస్ఆర్‌టీపీ నాయకులు అనిల్‌కుమార్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అంగన్వాడీలు తమను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న సమ్మె మంగళవారం 23వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని వైఎస్ఆర్‌టీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కోఆర్డినేటర్ బెజ్జంకి అనిల్‌కుమార్ సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. సమ్మెకు పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పెందూర్ మనోహర్, రాష్ట్ర నాయకులు మెస్రం శంకర్, పట్టణ అధ్యక్షుడు షేక్ అస్లం, సీనియర్ నాయకులు రాహుల్‌రెడ్డి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కృష్ణంరాజు పాల్గొన్నారు.

కాసిపేట : మండల కేంద్రంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాల సమ్మె మంగళవారం 23వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని రోడ్లు ఊడ్చి నిరసన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

ఐదు శాతం ఐఆర్‌ను వ్యతిరేకిస్తున్నాం

- యుఎస్‌పీసీ నాయకురాలు వైద్య శాంతికుమారి

నవతెలంగాణ-కాగజ్‌నగర్



ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఐదు శాతం ఐఆర్ ప్రకటించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకురాలు, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతికుమారి అన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పీఆర్‌సీ కమిటీని నియమించడాన్ని తాము స్వాగతిస్తున్నామని, ఆరు నెలల్లో నివేదిక తెప్పించి అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. మధ్యంతర భృతి కేవలం ఐదు శాతం ప్రకటించడం ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఊహకందని అంశంగా పరిగణిస్తున్నామని అన్నారు. వెంటనే పది శాతం ఐఆర్ ప్రకటించాలని, బకాయి ఉన్న రెండు డీఏలను విడుదల చేయాలని, ట్రెజరీలో ఆమోదం పొంది ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటిని ఎన్నికల షెడ్యూలు రాకముందే క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు.

మున్సిపాలిటీ ముందు కాంగ్రెస్ ధర్నా



నవతెలంగాణ - మంచిర్యాల

మంచిర్యాల పురపాలక సంఘం పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో వివక్షత చూపుతున్నారని బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా మంగళవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మంచిర్యాలలో నీటి కొరత ఉందని నిరసన తెలిపారు. ఖాళీ కుండలతో నిరసన తెలిపి అనంతరం వాటిని పగలగొట్టారు. మంచిర్యాలలో ఉన్న సమస్యలను ఏకరువు పెడుతూ మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్‌కు కౌన్సిలర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు రావుల ఉప్పలయ్య, ఉప నాయకుడు వేములపల్లి సంజీవ్, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి మాట్లాడుతూ పాలకపక్షం విపక్ష సభ్యుల పట్ల వివక్షత చూపుతూ అభివృద్ధి పనులకు నిధులు కేటాయించడం లేదని ఆరోపించారు. మంచిర్యాలలో అనేక సమస్యలు ఉన్నా వాటిని పరిష్కరించడంలో అధికార పార్టీ విఫలమైందని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదన్నారు.

వన్యప్రాణుల వారోత్సవాలు



నవతెలంగాణ-చెన్నూర్

అటవీ శాఖ ఆధ్వర్యంలో 69వ వన్య ప్రాణుల వారోత్సవాలు మంగళవారం పట్టనంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్డీఓ రమేష్ మాట్లాడుతూ దేశంలోని జంతువుల ప్రాణాలను పరిరక్షించడానికి ఏటా అక్టోబర్ 2 నుండి 8 వరకు వన్యప్రాణుల వారోత్సవం జరుగుతుందని తెలిపారు. ఇందులో భాగంగా పట్టణంలోని అటవీ శాఖ కార్యాలయం నుంచి అంబేద్కర్ ఈకో పార్క్ వరకు అటవీ అధికారులు, సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. క్లిష్టమైన చర్యల ద్వారా వన్యప్రాణుల ప్రాణాలను కాపాడటానికి, అవగాహన పెంచడానికి 1952లో వైల్డ్‌లైఫ్ వీక్ స్థాపించబడిందని, దేశంలో సుమారు 400 నేషనల్ పార్కుల్లో వన్య ప్రాణులను పరిరక్షిస్తున్నారని తెలిపారు. పులులు, ఏనుగులు, సింహాలతోపాటు ఎన్నోరకాల జంతువులు స్వేచ్ఛగా జీవిస్తున్నాయన్నారు. వన్యప్రాణులపై అవగాహన, వాటి పరిరక్షణపై చైతన్యం కల్పించేందుకు, అవి అంతరించిపోకుండా, రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ రవి, శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.